అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు -- ఉప సర్పంచ్ శ్రీనునాయక్ స్వాముల ఆశీస్సులు..



ఖమ్మం/ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

రఘునాథపాలెం మండలం హర్యాతండా గ్రామంలో ఉప సర్పంచ్ శ్రీనునాయక్ అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు భిక్ష సమర్పించి, స్వాముల ఆశీస్సులు అందుకున్నారు.అనంతరం అయ్యప్ప స్వాములు ఉప సర్పంచ్ శ్రీనునాయక్ స్వామిని ఆశీర్వదించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అయ్యప్ప స్వాముల సేవలో పాల్గొని వారి ఆశీస్సులు పొందడం ఎంతో ఆనందంగా ఉందని శ్రీనునాయక్ స్వామి తెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకు యూనివర్సల్ విద్యార్థి ఎంపిక..



ఖమ్మం/ తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ జట్టుకు తల్లాడ యూనివర్సల్ విద్యాల యానికి చెందిన పదో తరగతి విద్యార్థి కోడూరు అరవింద్ ఎంపిక అయ్యాడు. శనివారం ఎర్రుపాలెం మండలం లోని మామూనూరు లో నిర్వహించిన బాలూరు (అండర్-17)కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అరవింద్ ని ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.రెండు జిల్లా స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల కరస్పాండెంట్ టి.కె. ప్రసన్నన్, డైరెక్టర్ మరి సోఫియా, పీఈటీ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు యాకుబ్, రమేష్, రోహిణి, మనీషా, సమత, హేమ, లావణ్య, అరుణ సిరి, రమ, రమ్య, గీత, కృష్ణవేణి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. అరవింద్ నీ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే రాందాస్ నాయక్ పెద్ద కుమార్తె డాక్టర్ మాలోత్ గాయత్రి వివాహ మహోత్సవానికిప్రతి గడపకు వివాహ ఆహ్వానం..

- ప్రతి కుటుంబానికి ప్రత్యేక ఆహ్వానం..



ఖమ్మం/ వైరా నవంబర్ 21 (అక్షరం న్యూస్)

వైరా ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్ పెద్ద కుమార్తె డాక్టర్ మాలోత్ గాయత్రి వివాహ మహోత్సవానికి వైరా నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించిన నేపథ్యంలో, వారి ఆదేశాల మేరకు శనివారం వైరా మండలంలోని ప్రతి గడపకు వివాహ ఆహ్వాన పత్రికలను అందజేస్తూ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ నియోజకవర్గ ప్రజలను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ, ప్రతి కుటుంబానికి వ్యక్తిగతంగా ఆహ్వానం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.డిసెంబర్ 03వ తేదీన వైరాలో జరగనున్న ఈ వివాహ మహోత్సవానికి నియోజకవర్గంలోని ప్రతి కుటుంబం తరలివచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారు.ఈ వివాహ వేడుకకు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులే.. మీ రాకే మా కుటుంబానికి ఆనందం, ఆత్మీయతకు ప్రతీక!కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, మచ్చ వెంకటేశ్వరరావు (బుజ్జి), ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బీడీకే రత్నం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.. పీడిఎస్ యు



ఖమ్మం/ టౌన్ నవంబర్ 21(అక్షరం న్యూస్)

శనివారం పిడిఎస్యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని ఉమెన్స్ కళాశాల ఎదుట ఇంటర్మీడియట్ బోర్డు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన చేయడం జరిగింది.ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు గోగినపల్లి మస్తాన్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సింది పోయి, విలీనం పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దనీ,ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలనే ప్రతిపాదనను పునఃపరిశీలించాలని , విలీనం పేరుతో ప్రభుత్వ జూనియర్ ఈకళాశాలల ప్రత్యేక ఉనికికి, ఇంటర్మీడియట్ అధ్యాపకుల పోస్టులకు, విద్యార్థుల విద్యా అవకాశాలకు నష్టం కలిగే ప్రమాదం ఉందనీ, ముఖ్యంగా గ్రామీణ, పేద, సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై ఆధారపడి ఉన్నారు. ఈ వ్యవస్థ బలహీనపడితే పేద విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందనీ, విద్యను ప్రైవేటీకరించి కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలుకూర్చే విద్యా వ్యతిరేక విధానాలను రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకొస్తున్నారని, నూతన జాతీయ విద్యా విధానం 2020 ను ఒకవైపు వ్యతిరేకిస్తూ మరొకవైపు తెలంగాణలో అమలు చేస్తా అనటం సరైనది కాదని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలనీ,ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు....ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు గాంధీ రాము శ్రీకాంత్ యశ్వంత్ సాగర్ రాజశేఖర్ రోహిత్ కావ్య లలిత స్వప్న పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ బీమా పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

- తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఖమ్మం/తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు ప్రవేశపెట్టిన ఇందిరాగాంధీ జీవిత బీమా పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరు లక్ష్మారెడ్డి, తల్లాడ మండలం సీనియర్ నాయకులు దుండేటి వీరా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. శనివారం తల్లాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తల్లాడ మండల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్ద మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని చేపట్టిందని, గ్రామ గ్రామాన ప్రజలకు సమాచారం తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు,తల్లాడ మండలం సర్పంచులు, ఉప సర్పంచ్లు,టౌన్ ప్రెసిడెంట్ లు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మాజీ విడిసి చైర్మన్ లు, మాజీ జడ్పీటీసీ లు,మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు టాటా ఏసీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 19 గోవుల పట్టివేత..

- నలుగురు నిందితుల అరెస్ట్.. ఆరుగురిపై కేసు నమోదు
- నేలకొండపల్లి ఎస్సై శ్రీనివాస్ రెడ్డి..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

నేలకొండపల్లి మండలం పైనంపల్లి టోల్ ప్లాజా వద్ద శనివారం ఉదయం పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రెండు టాటా ఏసీ ఈ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 19 గోవులను నేలకొండపల్లి ఎస్సై శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు.ఎలాంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లా అక్కపల్లి నుంచి హైదరాబాద్కు గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు ఎస్సై తెలిపారు.ఈ ఘటనకు సంబంధించి ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేయగా, వారిలో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. పశువులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ గోశాల కు తరలించినట్లు పేర్కొన్నారు.

కేసులో నిందితుల వివరాలు:

1. కళా శివ (అనకాపల్లి జిల్లా అక్కపల్లి)2. జింజుల వెంకటరమణ (అనకాపల్లి జిల్లా అక్కపల్లి)3. కోన సింహాద్రి (అనకాపల్లి జిల్లా అక్కపల్లి)4. కొర్ర ప్రసాద్ (బుచ్చిరాజుపేట ఏ.పి)5. ఎర్ర వెంకట శివ (అనకాపల్లి జిల్లా అక్కపల్లి)6. దెక్కారపు రమేష్ (బుచ్చిరాజుపేట ఏ.పి)

ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం..

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం..
- 20వ వార్డు, కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు



ఖమ్మం/వైరా టౌన్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు శ్రీకారం చుట్టారు. ఇందిరమ్మ ఇంటి పట్టా పొందిన రాయల సులోచన నూతనంగా నిర్మించుకోనున్న ఇంటికి వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు ముగ్గుపోసి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబు మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ సహకారంతో వార్డులో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. 20వ వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యతతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారు రాయల సులోచన ఆనందం వ్యక్తం చేస్తూ, ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించిన కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి శ్యాంబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉంద్రు శ్యాంబాబు,వార్డు నాయకులు పువ్వాళ్ల రాము, హుస్సేన్, నవీన్, ఖాజా, వెంకటేశ్వర్లు, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ లాల్ మియా, సాయి శిరీష తదితరులు పాల్గొన్నారు.

డల్లాస్‌లో వైరా మండల కాంగ్రెస్ ఎన్నారై సభ్యుల ఆధ్వర్యంలో నర్సిరెడ్డి కి ఘన సన్మానం

- సోనియా గాంధీ జ్ఞాపకాలపై ప్రత్యేక పుస్తకావిష్కరణ..



ఖమ్మం/ వైరా నవంబర్ 21 (అక్షరం న్యూస్)

అమెరికాలోని డల్లాస్ నగరంలో వైరా మండలానికి చెందిన కాంగ్రెస్ ఎన్నారై సభ్యుల ఆధ్వర్యంలో వైరా మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నర్సిరెడ్డి కి ఘనంగా సన్మానం నిర్వహించారు. వల్లాపురం గ్రామానికి చెందిన తుమ్మల రామారావు కుమారుడు తుమ్మల అచ్యుత్, తుమ్మల సత్యనారాయణ కుమారుడు తుమ్మల సురేష్ నివాసంలో ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా నర్సిరెడ్డి ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. వైరా మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధి కార్యక్రమాల్లో చేస్తున్న కృషిని ప్రశంసించారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే రామచంద్ర నాయక్ అందిస్తున్న సహకారానికి, నర్సిరెడ్డి కృషికి ఎన్నారై కాంగ్రెస్ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సోనియా గాంధీ జ్ఞాపకాలు, జీవిత ప్రస్థానంపై ప్రత్యేక పుస్తకావిష్కరణ..

ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా సోనియా గాంధీ జీవిత ప్రస్థానం, జ్ఞాపకాలు, రాజకీయ ప్రయాణం, ప్రజాసేవ, దేశం పట్ల ఆమెకున్న అంకితభావం.. భారతదేశ అభివృద్ధిలో ఆమె పోషించిన పాత్రను ప్రతిబింబించే ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సోనియా గాంధీ దేశం కోసం చేసిన సేవలు, త్యాగాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. అలాగే గాంధీ కుటుంబం భారతదేశ రాజకీయ, సామాజిక అభివృద్ధికి అందించిన సేవలను ప్రస్తావించారు. ఈ పుస్తకం ద్వారా సోనియా గాంధీ జీవిత విశేషాలు, జ్ఞాపకాలు మరియు సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశాన్ని వ్యక్తం చేశారు.మెరుగైన భారతదేశ నిర్మాణం కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో ముందుకు సాగాలనే తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తుమ్మల అచ్యుత్, తుమ్మల సురేష్, రమణ గూడూరు, హరికృష్ణ రెడ్డి శీలం, వేణు మచ్చా, మువ్వ విజయ్, సురేష్ పోతులూరి, రవి, రవి కుర్రా, చంద్రశేఖర్, వడ్లమూడి అశోక్, ఇరగం రెడ్డి, పేరం, తుమ్మల శ్రీహిత, తుమ్మల కార్తీక్, నిషిత్, సాయి మచ్చా, చందు బండి తదితర కాంగ్రెస్ నాయకులు, ఎన్నారై సభ్యులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.డల్లాస్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ సమావేశం సన్మానం, ప్రత్యేక పుస్తకావిష్కరణతో పాటు వైరా మండల అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించుకునే వేదికగా నిలిచింది.

ఆర్నకొండలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



చొప్పదండి/ కరీంనగర్,నవంబర్ 22 (అక్షరం న్యూస్)

మండలంలోని అర్నకొండ గ్రామంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి హాజరైన చొప్పదండి సింగిల్ విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ల భారాస ప్రభుత్వంలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందించడంతో పాటు సన్న బియ్యంతో వారి కడుపు నింపుతున్నామన్నారు. చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం గారి కృషి, పట్టుదలతో మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు దూసుకెళుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలను అందించడం లో కూడా ముందు ఉంటుందని నిరూపిస్తూ చేయుత పెన్షన్ల తో పాటు భూమి నిరుపేద కుటుంబాలకు 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల లోపు గల వ్యక్తులకు నూతనంగా ఇందిరమ్మ భీమా పథకం ద్వారా 5లక్షల రూపాయిల ఆర్థిక సహాయం అందించే పథకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం అని తెలియజేశారు అనంతరం అధికారులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్లూరి లక్ష్మీ – భూమయ్య, ఆర్నకొండ సింగిల్ విండో డైరెక్టర్స్ ఎల్లాల సంతోష్ రెడ్డి,బుస భీమయ్య,రాపెల్లి ఐలయ్య,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చిలుముల స్వప్న, గర్షకుర్తి సునీత జక్కుల జనార్దన్, మచ్చ రమేష్,సోమిడి శ్రీనివాస్,పిట్ట మనోహర్,ఇరుకుళ్ళ సంతోష్, బుస అజయ్,బడుగు నరేష్,ప్రజలు,నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం పట్టణంలోని చౌకధరల దుకాణం తనిఖీ 6ఏ కేసు నమోదు, నిల్వల స్వాధీనం...

- **జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్**

ఖమ్మం/ స్టాప్ రిపోర్టర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

ఖమ్మం పట్టణంలోని చౌకధరల దుకాణం నెం. 2281001 డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నట్లు వీడియో ఆధారాలతో కూడిన ఫిర్యాదు అందిందని, దీనిపై జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారని జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు. ?జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, సదరు చౌకధరల దుకాణాన్ని స్వయంగా తనిఖీ చేసి విచారణ చేపట్టినట్లు అన్నారు. ఈ విచారణలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో, దుకాణ డీలర్ ఎం. రాజయ్య పై నిత్యావసర సరుకుల చట్టం, 1955 (జుంంవత్ఱుశ్రీ జశీఎఎశీఎఱ్అవం ూూష్, 1955) ప్రకారం 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందని, అనంతరం దుకాణంలో నిల్వ ఉన్న 6.84 క్వింటాళ్ల సరుకులను స్వాధీనం చేసుకుని, భద్రత నిమిత్తం సమీపంలోని చౌకధరల దుకాణం నెం. 2281002 డీలర్‌కు అప్పగించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజా పంపిణీ వ్యవస్థలో పూర్తి పారదర్శకతను కాపాడతామని, లబ్ధిదారులకు చేరాల్సిన రేషన్ సరుకులను పక్కదారి పట్టించే వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రేషన్ పంపిణీలో ఎక్కడైనా అవకతవకలు జరిగితే ప్రజలు వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా పౌరసరఫరాల అధికారి కోరారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్లైన్ ప్రక్రియను పరిశీలించిన..డిఎల్పీఓ సురేష్ బాబు ఎంపీడీవో శ్రీధర్ రాజు



ఖమ్మం/తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్లైన్ ప్రక్రియను తల్లాడ మండల పరిధిలోని పలు గ్రామాలలో డిఎల్పీఓ సురేష్ బాబు,ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజు,ఎంపీఓ హరికృష్ణ తోపరిశీలించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.తల్లాడ మండలంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రెండవ రోజు కూడా దిగ్విజయంగా కొనసాగుతుంది. గ్రామాల్లో లబ్ధిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆన్ లైన్ నమోదు చేసుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రేజర్ల శ్రీనివాస్, మిట్టపల్లి ఎం. రమాదేవి, రామానుజవరం లావణ్య, ముద్దునూరు రమేష్, మంగాపురం పరశురామ్, లక్ష్మీపురం రాజ్యలక్ష్మి, కొత్త వెంకటగిరి ఎస్ కె మైబుబు, బిల్లుపాడు బి. సాయి కుమార్, రంగంబంజర పానకాలు, మల్సుతశీడ హారతి, నూతనకల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అభివృద్ధి ప్రణాళికను పకడ్బందీగా రూపకల్పన చేయాలి...


- **జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్**
- **విశాలమైన ఆర్థిక వ్యవస్థ, మెరుగైన ఆదాయం, సుసంపన్నమైన భవిష్యత్ దిశగా ఖమ్మం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి..**
- **2028 నాటికి తలసరి ఆదాయం రూ. 5 లక్షలు, 2033 నాటికి రూ.10 లక్షలకు పెంచే లక్ష్యంతో కార్యాచరణ..**
- **ప్రతి శాఖకు నిర్దిష్ట లక్ష్యాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలి... జిల్లా కలెక్టర్**



ఖమ్మం/ స్టాప్ రిపోర్టర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

ఖమ్మం జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అన్నారు . శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన పై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ లక్ష్యాలను స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలుగా విభజించుకుని, నిర్దేశిత గడువులోగా వాటి సాధనకు పక్కా కార్యాచరణతో ఉండాలన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు విద్యుత్, పునరుత్పాదక ఇంధన, తాగునీటి రంగాల అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. వ్యవసాయ రంగంలో భాగంగా 2032 మార్చి నాటికి రైతుల నికర ఆదాయాన్ని 15 శాతం మేర పెంచడం, 5 వేల ఎకరాల్లో లాభదాయక సాగు పద్ధతులను విస్తరించడం, డ్రోన్ల వినియోగం, యాంత్రీకరణ ప్రణాళిక చేయాలన్నారు. ఉద్యానవన శాఖ పరిధిలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు డ్రిప్ ఆటోమేషన్ పెంచాలని, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 2030 నాటికి పశువుల్లో గాలికుంటు, పీపీఆర్, రేబిస్ వ్యాధుల పూర్తి నిర్మూలన, 4 వేలకు పైగా పశువుల షెడ్ల నిర్మాణం, పశుగ్రాస క్షేత్రాల అభివృద్ధి, మత్స్య శాఖ ద్వారా చెరువుల అభివృద్ధి, ఆధునిక మత్స్య మార్కెట్ల నిర్మాణం, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు వంటి అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం నూతన 33/11 కేవీ సబ్-స్టేషన్ల నిర్మాణం, ఓవర్‌లోడ్ ఫీడర్ల విభజన, భూగర్భ కేబుల్ పనులు, వినియోగదారుల ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. టీజీరెడ్కో ద్వారా పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, మోడల్ సోలార్ గ్రామాల పథకాల కింద సోలార్ రూఫ్‌టాప్‌లు, వ్యవసాయ సోలార్ పంపుసెట్లు, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేతిపంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు, నూతన ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుల నిర్మాణ కార్యాచరణ కు కలెక్టర్ సూచించారు. సెర్ప్ శాఖ పరిధిలో జిల్లాలో మహిళలను స్వయం సహాయక సంఘాల్లో భాగస్వాములను చేయడం, వారిలో సగం మందిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రణాళికలు రూపొందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఉదాహరణగా తెలిపారు. సాగునీటి శాఖ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందించడం, జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల వల్ల కలిగే సమస్యల పరిష్కారం వంటి అంశాలపై శాఖల వారీగా లక్ష్యాలు రూపొందించాలని అన్నారు.జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. 2028 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5 లక్షలకు, 2033 నాటికి రూ.10 లక్షలకు పెంచే లక్ష్యంతో శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సూచించారు. 2033-34 నాటికి ఖమ్మం జిల్లాను అభివృద్ధి చెందిన జిల్లాగా ప్రకటించే స్థాయికి తీసుకెళ్లేందుకు సమన్వయంతో పని చేయాలని అన్నారు.లక్ష్యాలను నిర్దేశించుకోవడమే కాకుండా వాటి సాధనకు అవసరమైన వనరులు, చేపట్టాల్సిన పనులు, అమలు చేయాల్సిన విధానం, నిర్దిష్ట కాలపరిమితులను స్పష్టంగా పేర్కొనాలని అన్నారు. జిల్లా అభివృద్ధిలో అన్ని రంగాల సమతుల్య వృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి రంగానికి సంబంధించి అవసరమైన గణాంకాలను సేకరించి విశ్లేషణ ఆధారంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.అంతకుముందు కలెక్టర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష చేశారు. ప్రజల దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తు తిరస్కారంపై కారణాలతో సహా దరఖాస్తుదారునికి వ్రాతపూర్వకంగా తెలిపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కెర వెంకటరామిరెడ్డికి ఘన నివాళులు అర్పించిన..జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలూరి బాబు రెడ్డి



ఖమ్మం/ తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

గానుగపాడు గ్రామానికి చెందిన ముక్కెర వెంకటరామి రెడ్డి ఇటీవల మృతి చెందారు. శనివారం ఆయన దశదినకర్మ ఆయన గ్రామంలో నిర్వహించారు. దశదిన కార్యక్రమంలో కుర్నవల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలూరి వెంకటరామిరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'తో పేదలకు ఎంతో లబ్ధి..

- **ముద్దునూరు గ్రామ సర్పంచ్**
- **యరమల రామ్మోహన్ రెడ్డి**



ఖమ్మం/తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంతో పేదలకు చాలా మేలు జరుగుతుందని ముద్దనూరు గ్రామ సర్పంచ్ యరమల రామ్మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం తల్లాడ మండల పరిధిలోని ముద్దునూరు గ్రామం లో సర్పంచ్ యరమల రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమ పథకం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ .. పేద కుటుంబాల వారికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. లబ్ధిదారులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి ప్రీమియం మన ప్రజా ప్రభుత్వమే భరిస్తుందని, నెల రోజులపాటు కొనసాగే నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామ పెద్దలు ,గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన అన్నారుగూడెం నాయకులు..



ఖమ్మం/తల్లాడ నవంబర్ 21(అక్షరం న్యూస్)

ఏపీలోని తిరువూరు మండలం వావిలాల గ్రామానికి చెందిన చేకూరి రాము, ప్రవళిక రిసెప్షన్ వేడుక శనివారం తిరువూరులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ నిర్మల దంపతులు, గ్రామ నాయకులు హాజరై నూతన దంపతులకు అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, పొన్నం కృష్ణయ్య, మారెళ్ళ దేవేంద్రరావు, దుగ్గినేని సత్యమయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో ఘనంగా శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 418 వ జయంతి వేడుకలు...



ఖమ్మం/తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

తల్లాడ మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 418వ జయంతి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సంఘం అధ్యక్షులు గంటల వెంకటాచారి ఆధ్వర్యంలో, స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న దేవాలయంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సోదరులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వేడుకల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన పోలీస్ కమిషనర్..



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్ ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరు పరిశీంచారు. సీసీటీఎన్ఎస్ వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.అలాగే, పెండింగ్‌లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి పరిష్కరించాలని, కేసుల దర్యాప్తు పురోగతిని నిరంతరం సమీక్షించాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి విధినిర్వహణపై పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

డిఈ ఝాన్సీ విజయలక్ష్మిని కలిసిన అన్నారుగూడెం రైతులు..



ఖమ్మం/తల్లాడ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

సీతారామప్రాజెక్టు నుండి వచ్చే నీటిని రామచంద్రపురం మేజర్ కి త్వరగా అందించి రైతులను కాపాడాలని తల్లాడ డిఈ ఝాన్సీ విజయలక్ష్మి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఆపతి వెంకటరామారావు తో అన్నారుగూడెం రైతులు.. నేడు ఉదయం నుండి సీతారామ ప్రాజెక్టు నీటిని మండల పరిధిలోని అన్ని మేజర్ లుకి నీటిని అందిస్తామని రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని డిఈ ఝాన్సీ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆపతి వెంకట రామారావు,గొర్ల మోహనరెడ్డి, రాయల వెంకటేశ్వర్లు, చీకటి రాంబాబు, చీకటి బాబు, తూము రాంబాబు, రాయపాటి అప్పారావు రైతులు పాలొన్నారు

డిసెంబర్ 29న చలో హైదరాబాద్ .. మాస్ లైన్



ఖమ్మం/ ఏన్కూర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

ఏనుకూరు మండల కేంద్రంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ వైరా డివిజన్ కార్యదర్శి ఎస్కె లాల్మియా మాట్లాడుతూ అటు మోడీ. అమిత్ షా బిజెపి కేంద్ర ప్రభుత్వం ప్రజల. దేశ మౌలిక సమస్యలను గాలికి వదిలి మత ఉన్మాదం లేపుతూ మూఢత్వాన్ని దెబ్బకొడుతూ ప్రశ్నించే వారి గొంతు నొక్కుతూ జైల్లో పెడుతున్నారని. దేశ కీలక వనరులను దేశ సంపదలను ఆదానీ అంబానీ లాంటి దేశ బడా కార్పోరేట్ శక్తులకు అలానే విదేశీ కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆయిల్ ఖనిజాలు బ్యాంకులు కీలక పరిశ్రమలు ఇస్రో లాంటి పరిశోధన సంస్థలను రక్షణ రంగం కీలక భాగాలు విమానాశ్రయాలు రైల్వే తదితరులను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని తదితర డిమాండ్లతో డిసెంబర్ 29న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని సిపిఐ మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జరిగే బహిరంగ సభను ప్రదర్శనలో ప్రజలు ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఏనుకూరు మండల కార్యదర్శి కొండే వెంకటేశ్వర్లు గడ్డం వెంకులు పృథ్వి వెంకన్న లక్ష్మీనారాయణ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టా శేఖర్ ను అభినందించిన ఆర్.జె.సి. కృష్ణ



ఖమ్మం/ టౌన్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

ఖమ్మం స్థానిక యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాలలో శనివారంపి.ఆర్.టి.యు., రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కట్టా శేఖర్ ని యస్.బి.ఐ.టి. కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పై రాష్ట్ర స్థాయిలో పోరాడే అవకాశం లభించిందని, వారి సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

చివరి తడి కోసం సీతారామ జలాలు విడుదల..

- రైతుల అభ్యర్థనపై తక్షణమే స్పందించి నీటి విడుదలకు ఆదేశాలు..
- వైరా--ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి,
- రామచంద్రపురం మేజర్ కాలువలకు గోదావరి జలాలు..
- ఆదివారం నాటికి మేజర్ కాలువలకు చేరుకోనున్న సాగునీరు..



ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

పంటలు ఎండిపోకుండా చివరి తడి అందించి ఆదుకోవాలంటూ రైతులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సాగునీటిని విడుదల చేశారు.ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, చివరి తడి అందకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి అవసరాన్ని వివరించి, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.దీంతో వైరా--ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. విడుదల చేసిన నీరు ఆదివారం నాటికి మేజర్ కాలువలకు చేరుకోనుంది. తద్వారా ఆయా కాలువల పరిధిలోని పంటలకు చివరి తడి అందే అవకాశం ఏర్పడింది.రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన గోదావరి జలాలను కేవలం పంటల సాగు అవసరాలకే వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా పొలాలకు అందేలా రైతులు సహకరించాలని కోరారు. చివరి తడి అందించడం ద్వారా పంటలను కాపాడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించి సాగునీరు విడుదల చేయించిన మంత్రి తుమ్మల నిర్ణయంపై ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం 44వ డివిజన్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాపై అవగాహన..

- రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా -- గడపగడపకు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేసిన గుడిపూడి జగదీష్



ఖమ్మం /టౌన్ 21 నవంబర్ (అక్షరం న్యూస్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ఖమ్మం నగరంలోని 44వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు, రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్, ఖమ్మం అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆదేశాల మేరకు 44వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు గుడిపూడి జగదీష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాలు రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో డిసెంబర్ 4 నుంచి 10వ తేదీ వరకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం వద్ద సంబంధిత అధికారులకు పత్రాలు అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడమే తమ లక్ష్యమని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాచర్ల తిరుమలరావు, మైనారిటీ నాయకులు ఎస్.కె. హుస్సేన, మహిళా నాయకురాళ్లు, కాంగ్రెస్ నాయకులు యువజన నాయకులు పాల్గొన్నారు.

కేబుల్ న్యూస్ ఛానళ్ల రిపోర్టర్ల లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలి.. డిపిఆర్ఓకి టీజేఎఫ్ వినతి..

- సానుకూలంగా స్పందించిన డీపీఆర్ఓ ..
- త్వరలోనే కార్డులు మంజూరు చేస్తామని హామీ..



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

కేబుల్ న్యూస్ ఛానళ్లలో విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి చిర్రా రవి లు, సమాచార, పౌర సంబంధాల శాఖ జిల్లా అధికారి గౌస్ పాషా ను కోరారు. ఈ మేరకు ఆయన నీ కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కేబుల్ న్యూస్ ఛానళ్ల రిపోర్టర్లకు ఇప్పటికే అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసిన విషయాన్ని టీజేఎఫ్ నాయకులు డీపీఆర్ఓ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా జిల్లాల్లో అమలవుతున్న విధానాన్ని పరిగణనలోకి తీసుకుని, తమ జిల్లాలోనూఅర్హత కలిగిన రిపోర్టర్లకు తక్షణమే అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వారితో పాటు శాటిలైట్ చానల్ లో విధులు నిర్వహిస్తున్న రిపోర్టర్ల దరఖాస్తుల సైతం పెండింగ్‌లో ఉండటంతో సంబంధిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.అక్రెడిటేషన్ కార్డుల జారీతో పాటు ఇటీవల అక్రెడిటేషన్ కార్డులు పొందిన ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డులు సైతం తక్షణమే మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు సంబంధించి హెల్త్ కార్డులు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.టీజేఎఫ్ నాయకులు లేవనెత్తిన అంశాలపై డీపీఆర్ఓ సానుకూలంగా స్పందించారు. పెండింగ్‌లో ఉన్న అక్రెడిటేషన్ కార్డుల మంజూరుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.డీపీఆర్వో నీ కలిసిన వారిలో ఎలెక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజనీకాంత్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, కోశాధికారి బిక్కి గోపి , జిల్లా నాయకులు వనం నాగయ్య, శ్రీధర్ శర్మ, కొమెర వెంకటేశ్వర్లు(కెవి), మందా మోహన్, మందుల ఉపేందర్, పిన్నెల్లి శ్రీనివాస్,సతీష్,కూరపాటి నరేష్ , మస్తాన్, ముక్కంటి, పెంటి వెంకటేశ్వర్లు, కిరణ్మయి,సంపత్ కుమార్ నాగ శేఖర్.మధు, శ్రీను,కేబుల్ చానల్ రిపోర్టర్లు నరసింహ, మోహన్, ఉపేందర్, శ్రీనివాస్,రమేష్, నరసింహారావు, అనిల్ కుమార్, లింగయ్య,భద్రం, గోపాల కృష్ణ, ఏ.సతీష్, ప్రభాకర్, మధు, జమలయ్య,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాన్ని ఎంఈఓ చావా శ్రీనివాసరావు ఆవిష్కరణ..



ఖమ్మం/ వైరా టౌన్ నవంబర్ 21 (అక్షరం న్యూస్)

జన విజ్ఞాన వేదిక వైరా మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ గవర్నమెంట్ హై స్కూల్ వైరా నందు నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైరా మండల విద్యాశాఖాధికారి చావా శ్రీనివాసరావు , జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మల్లెంపాటి వీరభద్ర రావు గవర్నమెంట్ హై స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వనమా సీతారామారావు , జన విజ్ఞాన వేదిక ఖమ్మం జిల్లా బాధ్యులు బీరెల్లి రామకృష్ణ పాల్గొన్నారు. మండల స్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాన్ని ఎంఈఓ చావా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్ర రావు మాట్లాడుతూ, జన విజ్ఞాన వేదిక గత మూడున్నర దశాబ్దాలకు పైగా సమాజంలో జరుగుతున్నటువంటి మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతుందని, ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్, స్వావలంబన కోసం సైన్స్, దేశ అభివృద్ధి కోసం సైన్స్ అనే నినాదాలతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. పిల్లల్లో శాస్త్రీయ భావాలు పెంపొందించుకోవాలని, సమాజంలో జరుగుతున్నటువంటి మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు . మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాస రావు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో సైన్స్ కీలక పాత్ర పోషిస్తుందని, పిల్లలను బాల శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని తెలిపారు. మండల స్థాయి టాలెంట్ టెస్ట్ లో 1)గవర్నమెంట్ స్కూల్స్ విభాగంలో ప్రథమ స్థానం జడ్పీహెచ్ఎస్ రెబ్బవరం 2) ప్రైవేట్ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి మధు విద్యాలయం .3) గురుకుల పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి టిజి రెసిడెన్సియల్ గర్ల్స్ వైరా ...4) గవర్నమెంట్ పాఠశాలల విభాగంలో ద్వితీయ స్థానం జడ్.పి.హెచ్.ఎస్ సిరిపురం సాధించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించినటువంటి జట్లు జిల్లా స్థాయికి ఎంపికైనాయి ... ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణ, నరసింహారావు ,సూర్యం ,వెంటరత్నం ,ప్రసాద్ , కృష్ణారావు , భాస్కర్ రావు ఫాతిమా జబీన్ , రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు..

మధిరలో ఎస్సి స్మశాన వాటికలో అభివృద్ధి పనులు ఎప్పుడు మొదలు పెడుతారు..



- ఎస్సి కమ్యూనిటీ హల్ దగ్గర మౌలిక సదుపాయాలు ఎప్పుడు కల్పిస్తారు.
- మున్సిపల్ ఎన్నికలకోసం ఇచ్చిన హామీలు అమలుచేసేది ఎప్పుడు.
- హడావిడిగా శంకుస్థాపనలు చేసిన నాయకులు ఎందుకు పనులు ప్రారంభించలేదు.
- పాపట్ల రమేష్ బీజేపీ ఎస్సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు.

ఖమ్మం /మధిర /నవంబర్ 22 / అక్షరం న్యూస్ :-మధిర మున్సిపల్ ఎన్నికల ముందు డిప్యూటీ సీఎం బట్టి మధిర డెవలప్మెంట్ పేరుతో కమిటీ ఏర్పాటు చేసి మున్సిపాలిటీలో ఉన్న 22 వార్డులల్లో మౌలికసాదుపాయాలు కోసం కోట్ల రూపాయలు ఇస్తున్నాం అని హడావిడి గా డెవలప్మెంట్ కమిటీ నాయకులు మరియు అధికారులు శంకుస్థాపన లు చేయటం జరిగింది. తరువాత జరిగిన ఎన్నికల్లో 22కి 21 వార్డులు కాంగ్రెస్ దాని మిత్రపాక్షము గెలవటం జరిగింది. మున్సిపాలిటీలో పాలకవర్గం వచ్చి ఎనిమిది నెలలు అవుతున్న ఎస్సి స్మశానం వాటికలో కానీ ఎస్సి కమ్యూనిటీ హల్ వద్ద కానీ ఇప్పటివరకు పనిని ప్రారంభించలేదు.ఎస్సి లు అంటే ఇంత చిన్నచూపు ఎందుకు ఇప్పటికైనా పాలకవర్గం స్పందించి ఎస్సి స్మశానం వాటికలు మరియు ఎస్సి కమ్యూనిటీ హల్ వద్ద పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాం.లేదంటే స్థానిక ఎస్సి కాలనీ ప్రజలతో కలసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు..

మధిరలో ప్రత్యేక లోక్ అదాలత్..



ఖమ్మం /మధిర /నవంబర్ 22 / అక్షరం న్యూస్ :- మధిర ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఈ రోజు జరిగిన ప్రత్యేక లోక్ అదాలత్లో 11ఎన్ టీ సి ఎన్ఐ యాక్ట్ కేసులు,1సి సిఎన్ఐ యాక్ట్ కేసు పరిష్కరం అయ్యాయని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి తెలిపారు.మొత్తం 12 కేసులకు గాను రూపాయలు 66,83,000/బికు పరిష్కారం అయ్యాయి.లోక్ అదాలత్లో సివిల్ కేసులు,చెక్ బౌన్స్ కేసులు,ప్రామోసరీ నోటు కేసులు,బ్యాంకు లోన్,ఆస్తి తగాదాలు పరిష్కరించుకోవచ్చు అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జింకల రమేష్, కె.విజయ్ కుమార్,కోర్టు సూపర్డెంట్లు టి.వెంకన్న,సి హెచ్ మల్లేశ్వరరావు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి..



సిద్దిపేట జిల్లా / దుబ్బాక / నవంబర్ 21 / అక్షరం న్యూస్ –: చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన పెంటమ్ కృష్ణ (40) చేపలు పట్టే వృత్తిని నిర్వహిస్తూ, భార్య ప్రియాంక, ముగ్గురు కుమార్తెలతో జీవనం కొనసాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే పట్టణంలోని పెద్ద చెరువు కాలువ వద్దకు చేపల వేటకు వెళ్లాడు. కాలువ వద్ద ప్రమాదవశాత్తు జారి మృతి చెందాడు. చేపల వేటకు వెళ్లిన భర్త ఇంటికి తిరిగి రాకపోయేసరికి, భార్య కుటుంబ సభ్యులతో కలిసి పెద్దచెరువు వద్ద పరిశీలిస్తుండగా, సమీపంలోని కాలువలో కృష్ణ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతియ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కంటిని కాపాడుకోండి

మధుమేహం అనగానే చాలామందికి రక్తంలో చకెర స్థాయిలు, ఆహార నియమాలు, గుండె లేదా కిడ్నీ సమస్యలే గుర్తొస్తాయి. కానీ, ఈ మహమ్మారి కంటి చూపును కూడా గుల్ల చేస్తుందనే విషయాన్ని చాలామంది గుర్తించరు. దయాబెటిస్ వల్ల కంటి లోపల తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ అండ్ ఎక్స్పెరిమెంటల్ ఆప్తమాలజీ నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ దిగ్భ్రాంతికర నిజాలు వెల్లడయ్యాయి. కంటి చూపు బాగుంది కదా అని భావిస్తూ, దాదాపు 60 శాతానికి పైగా బాధితులు కంటి పరీక్షలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ పరిశోధన పేరొంది. దయాబెటిస్ వల్ల వచ్చే కంటి సమస్యలు ఎలాంటి నొప్పి లేదా చూపులో మార్పులు లేకుండానే ఏళ్ల తరబడి లోపల పెరిగిపోతుంటాయి. నగరాల్లోని ఐటీ ప్రొఫెషనల్స్, మధ్య వయసులు, యువతలో షుగర్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నది. సాధారణంగా మధుమేహ బాధితులు బ్లడ్, షుగర్ లెవెల్స్ తరచూ చెక్ చేయించుకుంటారు కానీ, కంటి పరీక్షల జోలికి వెళ్లరు. చూపు మసకబారడం, కళ్ల ముందు నల్లటి చుకలు రావడం లేదా చదవడంలో ఇబ్బంది తలెత్తే వరకు కంటి వైద్యుడిని సంప్రదించరు. ఇలాంటి లక్షణాలు బయటపడే సమయానికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రక్తంలో చకెర స్థాయులు దీర్ఘకాలంపాటు నియంత్రణలో లేనప్పుడు, అవి కంటి లోపల ఉండే సూక్ష్మ రక్తనాళాలను దెబ్బతీస్తాయి. మనం స్పష్టంగా చూడటానికి కారణమైన రెటీనా సక్రమంగా పనిచేయాలంటే ఈ రక్తనాళాలే ఆధారం. షుగర్ తీవ్రత వల్ల ఈ నాళాలు బలహీనపడటం, వాపు రావడం లేదా రక్తం కారడం జరుగుతుంది. ప్రారంభ దశలో దీనివల్ల ఎలాంటి స్పష్టమైన హెచ్చరికలు ఉండవు. లోపల నష్టం జరుగుతున్నా సరే, బాధితుడు ఎప్పటిలాగే చదవడం, డ్రైవింగ్ చేయడం వంటి పనులు చేసుకోగలడు. మధుమేహం వల్ల కంటి శుక్లాలు, గ్లకోమాతో పాటు రెటీనా మధ్య భాగంలో వాపు వచ్చే ప్రమాదం ఉంది. దీనిని డయాబెటిక్ మాక్యులర్ ఎడెమా అని పిలుస్తారు. ఈ సమస్యలు ముదిరితే చిన్న అక్షరాలు చదవడం, ఫోన్ వాడటం, మనుషుల ముఖాలను గుర్తుపట్టడం, రాత్రి పూట డ్రైవింగ్ చేయడం కష్టంగా మారుతుంది. అందుకే చూపు మసకబారే వరకు వేచి చూడకుండా ముందే జాగ్రత్త పడాలి. కంటి చూపు బాగున్నంత మాత్రాన కళ్లు ఆరోగ్యంగా ఉన్నాయని అనుకోవడం పెద్ద పొరపాటు. చూపు స్పష్టంగా ఉన్నవారిలో కూడా డయాబెటిక్ రెటినోపతి అంతర్గతంగా ఉండే అవకాశం ఉంది.

కల్తీ కల్లు దందాపై ఉక్కుపాదం ఎక్కడ?

- ఆబ్కారీ శాఖ తనిఖీలు నామమాత్రమేనా?
- మద్నూర్ మండలంలో యథేచ్ఛగా కల్తీ కల్లు విక్రయాలు.
- యువత జీవితాలతో చెలగాటం



మద్నూర్ / నవంబర్ 21 (అక్షరం న్యూస్ – కామారెడ్డి) మద్నూర్ మండలంలో కల్తీ కల్లు విక్రయాలు జోరందుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, ఆబ్కారీ శాఖ తనిఖీలు మాత్రం నామమాత్రంగానే సాగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు వచ్చి తనిఖీలు నిర్వహించి వెళ్లిపోతున్నారే తప్ప, కల్తీ కల్లు విక్రయాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ఆబ్కారీ శాఖ ఆదేశాల మేరకు బిచ్కుంద ఆబ్కారీ సీఐ వినోద్ రాథోడ్ తన సిబ్బందితో కలిసి మద్నూర్ గ్రామంతో పాటు మండలంలోని పలు కల్లు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రయిస్తున్న కల్లుకు సంబంధించిన నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. కల్లులో నిషేధిత మత్తు పదార్థాలు, ముఖ్యంగా క్లోరల్ హైడ్రేట్ కలుపుతున్నారా? అనే కోణంలో అధికారులు ఆరా తీశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించారు.

అయితే ఈ తనిఖీలు కేవలం నమూనాల సేకరణకే పరిమితమవుతాయా? లేక కల్తీ కల్లు విక్రయాల వెనుక ఉన్న అసలు వ్యవహారాన్ని వెలికితీస్తారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో క్లోరల్ హైడ్రేట్ తరలింపు ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో మద్నూర్ మండలంలోనూ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

పవర్ కల్లు.. నాన్ పవర్ కల్లు పేరుతో విక్రయాలా?

మండలంలోని ఓ కల్లు దుకాణంలో పవర్ కల్లు, నాన్ పవర్ కల్లు పేర్లతో కల్లు లభిస్తున్నాయనే ప్రచారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో దూర ప్రాంతాల నుంచి సైతం కొందరు అక్కడికి వచ్చి కల్లు సేవిస్తున్నారని, ఈ అలవాటుకు బానిసలవుతున్న వారి సంఖ్య పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ కల్లులో ఏవైనా నిషేధిత పదార్థాలు కలుపుతున్నారా? అన్నది అధికారిక పరీక్షల ద్వారా తేలాల్సి ఉంది.

యువత భవిష్యత్తుపై ఆందోళన.. అధికారులకు ప్రజల విజ్ఞప్తి

కల్తీ కల్లు విక్రయాలు నిజమైతే వాటి ప్రభావం ప్రజల ఆరోగ్యంపైనే కాకుండా యువత భవిష్యత్తుపై కూడా తీవ్రంగా పడే ప్రమాదం ఉంది. మత్తుకు అలవాటుపడుతున్న యువత కుటుంబాలకు భారంగా మారుతూ తమ జీవితాలను అంధకారంలోకి నెట్టుకుంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కేవలం తనిఖీలు నిర్వహించి హెచ్చరికలు జారీ చేయడం కాకుండా, మండలంలోని అన్ని కల్లు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలను వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత దుకాణాల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కల్తీ కల్లు విక్రయాలకు అడ్డుకట్ట ఎప్పుడు? యువత జీవితాలను కాపాడేందుకు ఆబ్కారీ శాఖ ఇప్పటికైనా కఠిన చర్యలు చేపడుతుందా? అన్నది వేచి చూడాలి.

స్థానిక రాజకీయ నాయకుల బలంతో అక్రమ నిర్మాణాలు

- శ్రీరాంనగర్' రాఘవేంద్ర కాలనీలలో అక్రమ నిర్మాణాలు.
- సిఎంసి కమిషనర్ అధికారులపై ఆగ్రహం
- టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్నెన్ల పై నిఘా పెట్టాలి.

శేరిలింగంపల్లి అక్షరం క్రైమ్ బ్యూరో: కొండాపూర్ డివిజన్ పరిధిలో రాఘవేంద్ర కాలనీ, శ్రీరాంనగర్ కాలనీలలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు నిర్మిస్తుంటే జిహెచ్ఎంసి అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడట్లేదు, టౌన్ ప్లానింగ్ విభాగం బిల్డర్లకు భరోసా ఇస్తూ... మేమున్నాము అని హామీ ఇస్తున్నట్లు అక్కడ నివసిస్తున్న ప్రజలు అంటున్నారు. శ్రీరామ్నగర్, రాఘవేంద్ర కాలనీలో రాజకీయ నాయకుల అండ పుష్కలంగా లభించడంతో అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈ రాజకీయ నాయకుల అండతోనే పర్మిషన్ అనే మాటకు అర్థం లేకుండా పోయింది. జి ప్లస్2 కు పర్మిషన్ తీసుకుని, 6, 7 అంతస్తులు నిర్మిస్తున్న.. టౌన్ ప్లానింగ్ అధికారులు మౌనం..! తమకు అందిన కాడికి దండుకొని మీ పని మీరు చేసుకోండి అని క్రింది స్థాయి ఉద్యోగులు హామీ ఇస్తున్నట్లు అక్కడ నివసిస్తున్న ప్రజలు అంటున్నారు. చోటా,మోటా రాజకీయ నాయకులు అధికారులను లెక్కచేయడం లేదా?

సిఎంసి జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను పరిశీలించి నిజ నిజాలను ప్రజల ముందు పెట్టాలని ప్రజలు అంటున్నారు, రాజకీయ నాయకులకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని, రాజకీయ అండ ఉంటే ఏ అక్రమమైన చెల్లుతుందని భావిస్తున్న బిల్డర్లకు ఇది ఒక చెంపపెట్టుగా కావాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.



టౌన్ ప్లానింగ్ అధికారులు, రాజకీయ నాయకులు ముఠాగా ఏర్పడి..?

బిల్డర్లకు చోట, మోట రాజకీయ నాయకులు, జిహెచ్ఎంసి అధికారులు అభయహస్తం ఇస్తున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు, ఈ ఆరోపణల్లో నిజ నిజాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది, జోనల్ కమిషనర్, డిప్యూటీ జోనల్ కమిషనర్ లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఈ అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తున్న రాజకీయ నాయకులను నడిరోడ్డుపై నిలదీయాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. మరి సీఎంసి అధికారులు, జిహెచ్ఎంసి అధికారులు ఎంతవరకు ప్రజలకు న్యాయం చేస్తారో వేచి చూడాల్సిందే అని నెటిజెన్స్ డిమాండ్ చేస్తున్నారు.

శ్రీరామ్ నగర్ ఏ.బి.సి బ్లాక్ లలో రాజకీయ బలం.

శ్రీరామ్ నగర్ ఏ.బి.సి బ్లాక్ లలో పర్మిషన్ మాటకొస్తే దేవుడి ఎరుగు, ఇక్కడ రాజకీయ బలమే పర్మిషన్, క్రింది స్థాయి ఉద్యోగులను మేనేజ్ చేస్తూ విచ్చలవిడిగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఎవరైనా కంప్లైంట్ చేస్తే వారిపై బెదిరింపులు అన్ పార్లమెంట్ లాంగ్వేజెస్ ఉపయోగిస్తారు.

పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు

నోటీసులు ఇచ్చిన వెంబడే రాజకీయ నాయకులు వారి బలం ఉపయోగించి సెటిల్మెంట్ చేస్తారు. అని స్థానికులు అంటున్నారు. సగటు మనిషి జీవించడానికి ఇల్లు అవసరం కానీ ఎంత మేరకు అవసరమో అంతే నిర్మాణం చేసుకోవాలి, అది కూడా జిహెచ్ఎంసి అధికారుల పర్మిషన్ తో, ఇవన్నీ తుంగలో తొక్కి అందిన కాడికి దండుకొని రాజకీయ నాయకుల బలం ఉపయోగించి శునకానందం పొందుతున్నారు. ఇకనైనా టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిటీ టౌన్ ప్లానర్ (ఏసిపి) తక్షణ చర్యగా తీసుకొని ఆదిలోనే అడ్డుకోవాలని, పరిమితికి మించి నిర్మాణాలు కొనసాగించరాదని కాలనీవాసులు, అసోసియేషన్ వాసులు అధికారులను కోరుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా నెలకు జీతాలు తీసుకుంటున్న అధికారులు న్యాయం వైపు నిలుస్తారో అన్యాయం వైపు నిలుస్తారో వేచి చూడాలని నెటిజెన్స్ డిమాండ్ చేస్తున్నారు.

అక్షరం కథనానికి స్పందన..

విద్యుత్ తీగల చుట్టూ చెట్ల తొలగింపు.

షార్ట్‌సర్క్యూట్ ప్రమాదంపై కదిలిన విద్యుత్ శాఖ అధికారులు..



హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / నవంబర్ 21 / అక్షరం న్యూస్:- భీమదేవరపల్లి మండల కేంద్రంలో అంగన్వాడీ కేంద్రం సమీపంలో విద్యుత్ తీగలు చెట్ల పొదల్లో చిక్కుకుని షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగిన ఘటనపై అక్షరం దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా మారిన చెట్ల పొదలను తొలగించి విద్యుత్ లైన్లకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు.

మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం పక్కనే చెట్ల పొదల్లో విద్యుత్ తీగలు చిక్కుకోవడంతో ఇటీవల షార్ట్‌సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉండటంతో చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అక్షరం దినపత్రిక ప్రజల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది.

దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టారు. లైన్‌మెన్ బాలరాజు దగ్గరుండి విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు పొదలను తొలగించి విద్యుత్ లైన్లను సరిచేయించారు. దీంతో భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లయింది.

ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వాటి పరిష్కారానికి మీడియా కథనాలు దోహదపడుతున్నాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ఇలాంటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. అధికారుల స్పందనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. తృటిలో తప్పిన పెను ప్రమాదం!

- చెట్ల పొదల్లో చిక్కుకున్న విద్యుత్ వైర్లు..
- షార్ట్‌సర్క్యూట్‌తో ఎగసిపడిన మంటలు..
- పక్కనే అంగన్వాడీ కేంద్రం.. పిల్లలు లేకపోవడంతో తప్పిన ముప్పు...
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యం..



హనుమకొండ జిల్లా / భీమదేవరపల్లి / నవంబర్ 19 / అక్షరం న్యూస్:- మండల కేంద్రంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాల మీదకు తెచ్చింది. అంగన్వాడీ కేంద్రం సమీపంలో చెట్ల పొదల్లో విద్యుత్ తీగలు చిక్కుకుపోవడంతో గురువారం షార్ట్‌సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. దీంతో అక్కడే ఉన్న ప్రజలు భయాందోళనకు గురై ప్రాణభయంతో పరుగులు తీశారు. కృటిలో పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.మండల కేంద్రంలోని ఏసీడీపీఓ, తహశీల్దార్, పోలీస్ స్టేషన్, కార్యాలయాలకు వివిధ గ్రామాల నుంచి నిత్యం ప్రజలు తమ పనుల నిమిత్తం వస్తుంటారు. గురువారం మధ్యాహ్నం కూడా కార్యాలయాల పనుల కోసం వచ్చిన పలువురు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు సమీపంలోని చెట్ల నీడన నిలబడ్డారు. అదే సమయంలో చెట్ల పొదల్లో చిక్కుకున్న విద్యుత్ తీగల కారణంగా షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి భారీగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడున్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. అయితే మంటలు చెలరేగిన ప్రాంతానికి పక్కనే అంగన్వాడీ కేంద్రం ఉండటం ఆందోళన కలిగిస్తోంది. అదృష్టవశాత్తూ మధ్యాహ్నం సమయంలో చిన్నారులు కేంద్రంలో లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. ఒకవేళ చిన్నారులు అక్కడ ఉండి ఉంటే పరిస్థితి ఎంత భయంకరంగా ఉండేదోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మండల కేంద్రంలోనే విద్యుత్ తీగల నిర్వహణ ఇంత అధ్వానంగా ఉంటే మారుమూల గ్రామాల్లో విద్యుత్ శాఖ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు గొప్పలు చెప్పుకోవడం తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఉన్న విద్యుత్ తీగలను ముందుగానే గుర్తించి తొలగించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? ఇంతటి నిర్లక్ష్యానికి బాధ్యులెవరు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు చెట్ల పొదల్లో చిక్కుకున్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

లోకకల్యాణం కోసమే యాగాలు!

- అంజన్న సన్నిధిలో లక్ష్మీ గణపతి ప్రతిష్ఠ.. ఆలయ శిఖరానికి మహా సంప్రోక్షణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు..
- మహా అన్నదానం..




హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి నవంబర్ 21 (అక్షరం న్యూస్):-

సకల జనుల సుఖసంతోషాలు, లోక శాంతి, సర్వ మానవాళి శ్రేయస్సును కాంక్షిస్తూ ఆలయాల్లో యాగాలు, ఆధ్యాత్మిక క్రతువులు నిర్వహిస్తున్నట్లు ఆచార్య స్వామీజీ పులి సీతారామ శర్మ పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామంలోని పంచముఖ ఆంజనేయ స్వామి సన్నిధిలో శనివారం శ్రీ లక్ష్మీ గణపతి సహిత ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామీజీ పులి సీతారామ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణలుమంగళవాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. సంకటహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణలోని పలు ఆలయాల్లో శ్రీ లక్ష్మీ గణపతి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ప్రజలకు సకల శుభాలు కలగాలని ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆలయ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కేవలం ఆధ్యాత్మికతకే కాకుండా సమాజంలో ధర్మం, భక్తిభావం, ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడతాయని వివరించారు.ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ వ్యవస్థాపకులు కాసం రమేష్-స్వరూప దంపతులు వేలాది మంది భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గద్ద రాజమణి-సమ్మయ్య, గద్ద రజిత-సంపత్, వెనిశెట్టి ధనలక్ష్మి-ప్రశాంత్, కాసం దివ్య-జ్ఞానేశ్వర్, ఎర్రం స్రవంతి-శ్రావణ్, తనుకు ఝాన్సీ-వెంకటేష్, ఉప్పుగంటి రమాదేవి-జైపాల్ రెడ్డి, రాంపల్లి కళావతి-తిరుపతి, కంది రవీందర్ రెడ్డి, ఆలయ అర్చకులు ఉపేందర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ప్రభుత్వ సహాయం కోరుతూ సీఎస్‌కు వినతి

- మానవ హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరారపు వెంకటేష్



రామగిరి (పెద్దపెల్లి జిల్లా) నవంబర్ 21 అక్షరం న్యూస్:

అరుదైన వ్యాధితో బాధపడుతున్న నాలుగేళ్ల బాలుడు అశ్వర్థ్ గురుదత్త చికిత్సకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ -- తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరారపు వెంకటేష్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. డుచెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాలుడు బాధపడుతున్నాడని, వ్యాధి కారణంగా కండరాల బలహీనత పెరుగుతూ శారీరక కార్యకలాపాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినతి రూపకంగా పేర్కొన్నారు. బాలుడికి అవసరమైన ఆధునిక వైద్యం, ప్రత్యేక మందులు, నిరంతర వైద్య పర్యవేక్షణకు భారీ ఖర్చు అవుతుండటంతో బాలుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం, ప్రత్యేక వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాలుడి భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి తగిన సహాయం అందించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ వేదిక గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- గ్రామ అధ్యక్షులు కనకం రమేష్..
- ప్రధాన కార్యదర్శి భూక్య సంపత్...
- రాజ్యాంగ హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత..ఖీమండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య..



హనుమకొండ జిల్లా/ భీమదేవరపల్లి/ నవంబర్ 21/ అక్షరం న్యూస్:-

మండలంలోని (మంగళపల్లి)రాంనగర్)గ్రామంలో శనివారం భారత రాజ్యాంగ పరిరక్షణ వేదిక గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య, రేణికుంట్ల బిక్షపతి, ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు.గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కనకం రమేష్, ప్రధాన కార్యదర్శిగా భూక్య సంపత్, ఉపాధ్యక్షులుగా కనకం నరేష్, పార్నంది ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు డప్పు రాహుల్, భూక్య చిరంజీవి, బాదావత్ రవినాయక్, పార్నందుల అన్వేష్, సయద్ అబ్బాస్, కోఆర్డినేటర్‌గా మిట్టపల్లి రమేష్,నుఎన్నుకున్నారు.అదేవిధంగా కార్యవర్గ సభ్యులు హరియ, కనుకం శ్రీధర్ డప్పు ప్రవీణ్ వేమునూరి శ్రీధర్, సలహాదారులు డప్పు శ్రీనివాస్ సయ్యద్ భాషా, ఐలయ్య, రమేష్, ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.ఈ సందర్భంగా మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య మాట్లాడుతూ.. వందల సంవత్సరాల రాచరిక పాలనలో హక్కులు లేకుండా శ్రమదోపిడీకి గురై బానిసలుగా బతికిన భారతీయులకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, హక్కులు, విధులను కల్పించిందన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సామాజిక రాజకీయ ఆర్థిక అభ్యున్నతికి రాజ్యాంగం పునాది వేసిందని పేర్కొన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. రాజ్యాంగాన్ని బలహీన పరిచేందుకు కొన్ని మానవతావాద వ్యతిరేక శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. అలాంటి ప్రయత్నాలను ప్రజాస్వామ్య పద్ధతిలో తిప్పికొట్టేందుకు రాజ్యాంగ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రామగ్రామాన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై గ్రామ కమిటీలకు సహకరించాలని డ్యాగల సారయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పుల కుమారస్వామి రాంనగర్ సర్పంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి భాషా ప్రతిభ పోటీల్లో విద్యార్థుల సత్తా విద్యార్థులను అభినందించిన ఎంఈఓ



ఓదెల, నవంబర్ 21(అక్షరం న్యూస్)

ఓదెల: మండల స్థాయిలో నిర్వహించిన భాషా ప్రతిభ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఓదెల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిల్లా పరిషత్ పాఠశాల ఓదెలలో మండల విద్యాధికారి వై రమేష్ ఆధ్వర్యంలో మండల స్థాయి భాషా ప్రతిభ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.రచనా విభాగంలో దాసరి సహస్ర 10వ తరగతి ఓదెల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి విజేతగా నిలవగా, మరో విజేతగా జిల్లా పరిషత్ పాఠశాల పొత్కపల్లి విద్యార్థి నిలిచారు. ఉపన్యాస విభాగంలో జిల్లా పరిషత్ పాఠశాల ఓదెలకు చెందిన 6వ తరగతి విద్యార్థి గొడుగు శివనాగేంద్ర కుమార్, హనీ 5వ తరగతి విజయం సాధించారు.ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు వచ్చే నెలలో నిర్వహించనున్న పెద్దపల్లి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. విజేతలను మండల విద్యాధికారి, పాఠశాల ఇన్‌చార్జి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై రమేష్ హెచ్ఎం లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ బండి శోభారాణి ఎండి యూసఫ్ జానీ సంపత్ కుమార్ ప్రణీత తో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ నిమ్మ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన రెడ్డి నాయక్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానం



ఓదెల.నవంబర్ 21(అక్షరం న్యూస్)

ఓదెల: మండలం లంబాడి తండా గ్రామానికి చెందిన కుల పెద్దమనిషి రెడ్డి నాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామ సర్పంచ్ నిమ్మ నాయక్ ఆధ్వర్యంలో శివపల్లిలోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయరమణారావు రెడ్డి నాయక్ యూత్ లీడర్ పవన్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నిమ్మ నాయక్. మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావు ఆధ్వర్యంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుందని ఇదే తరుణంలో లంబడి తండ డబల్ రోడ్డు నిర్మాణానికి 6.30 కోట్ల రూపాయలు మంజూరు చేసినందుకు ప్రతి ఒక్కరం నీకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ లింగేష్ నాయక్ మరియు సింగిల్ విండో డైరెక్టర్ పరిష నాయక్ తో పాటు గ్రామ పాలకవర్గం పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించినవరంగల్ సీపీ ఎన్.శ్వేత ఐపీఎస్



జఫర్ గడ్,నవంబర్21, అక్షరంన్యూస్: వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ శనివారం జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సీపీకి పూల మొక్కలు అందించి స్వాగతం పలకగా,పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీపీ ఉసిరి మొక్కను నాటారు.వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు,రిజిస్టర్లు,కేసుల వివరాలను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు,బాధ్యతలు, పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సిబ్బందికి సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా యువత గంజాయి వంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా నిరంతరం నిఘా ఉంచాలని,గంజాయి వినియోగం,విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, వర్ధన్నపేట సీఐ వై. సంజీవరావు, జఫర్‌గఢ్ ఎస్ఐ.బొల్లం వినయ్ కుమార్, వర్ధన్నపేట ఎస్ఐ బోగం ప్రవీణ్, జఫర్‌గఢ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కొరకు ఎమ్మెల్యే గాంధీని కలిసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షేక్ చాంద్ పాషా



శేరిలింగంపల్లి ప్రతినిధి కొండాపూర్ డివిజన్ పరిధిలో గల శ్రీరామ్నగర్, రాఘవేంద్ర కాలనీలో పలు సమస్యలపై పిఎసి చైర్మన్ ఆర్కెపూడి గాంధీ నీ కలిసి రాఘవేంద్ర కాలనీ 'సి' బ్లాక్ లో డ్రైనేజీ, మంచినీటి కొరత, వీధిలైట్లు, సిసి రోడ్లు పలు సమస్యలపై పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీకి వివరించారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే పరిష్కారం చూపుతామని తెలిపారు. ఈ సందర్భంగా షేక్ చాంద్ పాషా ఎమ్మెల్యే గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోరాఘవేంద్ర కాలనీ 'సి, బ్లాక్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పుల్లారెడ్డి, శ్రీనివాసులు, బాబురావు శ్రీరామ్నగర్ అసోసియేషన్ నాయకులు ధనుంజయ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వరికి ప్రత్యామ్నాయంగా ప్రాద్దుతిరుగుడు సాగుతో లాభాలు

- ఏ డి ఏ: సుధా మాధురి
- జీరో టిల్లేజ్ విధానంతో పెట్టుబడి ఖర్చుకు తగ్గింపు.. రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/నవంబర్ 21/అక్షరం న్యూస్: వానాకాలంలో ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో యాసంగిలో వరి పంటకు బ దులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలనివ్యవ సాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.నీటి వన రుల లభ్యతను దృష్టిలో ఉంచుకొని బోర్లు, చెరువుల ఆ యకట్టు పరిధిలో వరికి బదులుగా ప్రాద్దుతిరుగుడు,మొ క్కజొన్న వంటి పంటలు సాగు చేసుకోవాలని అవగాహ న కల్పిస్తున్నారు.ఇందులో భాగంగా అడవిలింగాల గ్రా మంలో రైతు పోలీస్ రాజు వ్యవసాయ క్షేత్రంలో జీరో టి ల్లేజ్ (దుక్కి చేయకుండా) పద్ధతిలో ప్రాద్దుతిరుగుడు సా గుపై సహాయ వ్యవసాయ సంచాలకులు సుధా మాధు రి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు.వరి కోతలు పూర్తయిన వెంటనే పొలాన్ని దుక్కిచేయకుండా నేలలో తేమ ఉన్నప్పుడే నీరు పారించి ప్రాద్దుతిరు గుడు పంటను సాగు చేసుకునే విధానాన్ని వివరించారు.ఈ ప ద్ధతిని అనుసరించడం వల్ల దుక్కి ఖర్చులు తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం,సమయం ఆదా అవుతాయని తెలిపారు. ఇదే విధంగా మొక్కజొన్న పంటను కూడా ప్ర త్యామ్నాయంగా సాగు చేసుకోవచ్చని సూచించారు.ప్ర స్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి పం టల ఎంపిక చేసుకోవాలని,తక్కువ పెట్టుబడితో మెరుగై న ఆదాయం పొందే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రై తులు దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు కో రారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శోభ, వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్, రైతులు పోలీస్ రాజు, గుడిపల్లి వెంకటరామిరెడ్డి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి నీటిఎద్దడిని నివారించేందుకు ముందస్తుచర్యలు

- ఎల్లారెడ్డి పెద్ద చెరువులో నీటి నిల్వల పెంపునకు అధి కారుల కసరత్తు.
- బ్యాక్‌వాటర్‌ను అక్రమంగావినియోగిస్తే కఠినచర్యలు.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/నవంబర్ 21/అక్షరం న్యూస్: ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ప్ర జలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకుఅ ధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు పెద్ద చెరువులో నీ టి నిల్వలను పెంపొందించే అంశంపై రైతులతో సమావే శం నిర్వహించారు.ఈ సందర్భంగా పెద్ద చెరువులో నీటి ని నిల్వ ఉంచి, మున్సిపాలిటీ పరిధిలోని ఫిల్టర్ బెడ్‌కు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచడం ద్వారా ప ట్టణ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా చేసే అంశం పై చర్చించారు. నీటి నిల్వలను కాపాడేందుకుతీసుకోవా ల్సిన చర్యలు, అవసరమైన ఏర్పాట్లపై ఇరిగేషన్ శాఖడీ ఈ కిష్టయ్య,ఏఈ శరత్, మున్సిపల్ కమిషనర్ జీవన్ రై తులతో చర్చించారు.

చెరువు బ్యాక్‌వాటర్‌ను అక్రమంగా వినియోగించరాదు.

ఎల్లారెడ్డి పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ (పూర్తి నీటిమట్టం) పరి ధిలోని బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి ఎవరూ అక్రమంగా నీటిని తోడుకోవడం, ఇతర ప్రాంతాలకు తరలించడం లే దా ఇతర అవసరాలకు వినియోగించడం చేయరాదనిఇ రిగేషన్ శాఖ అధికారులు స్పష్టం చేశారు.ప్రస్తుత వాతా వరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలోపట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం పెద్ద చెరువులోనినీటి ని అందుబాటులో ఉంచడం అత్యంత అవసరమనిపే ర్కొన్నారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇ బ్బందులు తలెత్తకుండా చెరువులోని నీటినిల్వలనుసం రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావున రైతులు, ప్రజలు చెరువు నీటిని అక్రమంగా విని యోగించకుండా అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఎల్లారెడ్డి పట్టణ ప్రజల తాగునీటి అవస రాలను దృష్టిలో ఉంచుకొని అధికారులకు సహకరించా లని కోరారు.

బిడ్డలకు పాలిచ్చే తల్లులకు మొబైల్ అంగన్వాడీ

వాహనాలను ప్రారంభించిన సిఎంసి కమిషనర్ సృజన



శేరిలింగంపల్లి ప్రతినిధి: సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) ప్రధాన కార్యాలయంలో ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మొబైల్ అంగన్వాడీ వాహనాలను సిఎంసి కమిషనర్ సృజన అదనపు కమిషనర్ (యుసిడి) సుభద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మోతీ, యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి ఫిలిప్ ఎంఈఓ వెంకటయ్య తో కలిసి జెండా ఊపి ప్రారంభించిన పిఎసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో 0 నుండి 6 సంవత్సరాల వయస్సు పిల్లలకు, గర్భిణీలకు పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం అందించడమే మొబైల్ అంగన్వాడీ వాహనాల ముఖ్య ఉద్దేశ్యం అని, బస్తీలలో తిరుగుతూ పిల్లలకు పోషక ఆహారం అందించడం జరుగుతుంది అని వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలియచేశారు. మొబైల్ అంగన్వాడీ లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్యను బోధిస్తారు అని, పిల్లలు తల్లులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. టీకాలు, పిల్లలకు అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు వేయడంలో సహకరిస్తారు. పోషకాహారం ఆరోగ్యంపై తల్లులకు అవగాహన కల్పిస్తారు అని గాంధీ తెలియచేశారు. పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను సమగ్రంగా అందిస్తూ చిన్నారుల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. చిన్నారులకు పోషకాహారం అందించేందుకు విద్యా, ఆట వస్తువులు, ఎర్లీ చైల్డ్ కేర్ కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. నర్సరీ విద్య పూర్తి చేసిన చిన్నారులకు ప్రత్యేక సర్టిఫికెట్లు కూడా అందిస్తామన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇంగ్లీష్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. పిల్లలను లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే బదులు అంగన్‌వాడీల్లో చేర్పించాలని సూచించారు. అత్యుత్తమ వాతావరణంలో వారిని తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయగల సామర్థ్యం అంగన్‌వాడీ వ్యవస్థకు మాత్రమే ఉందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ ఒలింపియాడ్, టెడ్ టాక్ పోటీల్లో విద్యార్థుల సత్తా

- మండల స్థాయిలో ప్రతిభ చాటిన ఎల్లారెడ్డి పాఠశాలల విద్యార్థులు.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/నవంబర్ 21/అక్షరం న్యూస్: విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఎల్లారెడ్డిమం డల స్థాయి హైస్కూల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్, టెడ్ టాక్ ప్రతిభా పరీక్షలను శనివారం జిల్లా పరిషత్ బాలికల ఉ న్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ పోటీల్లో వివిధ ఉ న్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.సీనియర్ ఒలిం పియాడ్ విభాగంలో టీజీ మోడల్ స్కూల్‌కు చెందిన కె. అశ్విని ప్రథమ స్థానం, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల కు చెందిన ఏ. శ్రీనిధి ద్వితీయ స్థానం సాధించారు.జూని యర్ ఒలింపియాడ్ విభాగంలో టీజీ మోడల్ స్కూల్‌కు చెందిన ఆర్. వైష్ణవి ప్రథమ,వి.రూపశ్రీ ద్వితీయ స్థానా లు పొందారు.సీనియర్ టెడ్ టాక్ విభాగంలో జెడ్పీ బా లికల ఉన్నత పాఠశాలకు చెందిన అంశారా ప్రథమస్థా నం సాధించగా, టీజీ మోడల్ స్కూల్‌కు చెందిన అశ్విని కూడా ప్రతిభ కనబరిచారు. జూనియర్ టెడ్ టాక్ విభా గంలో జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఫిర్దో జ్ జహ ప్రథమ, ముబీనా ద్వితీయ స్థానాలు సాధించా రు.విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆంగ్ల భాషలో మాట్లాడే నైపుణ్యం, వేదికపై తమ ఆలోచనల ను స్పష్టంగా వ్యక్తపరిచే సామర్థ్యాన్ని పెంపొందించుకో వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జిప్రధానో పాధ్యాయులు కె. దేవదాస్, మండల బాధ్యులువెంకట రమణ, రామకృష్ణ,వెంకట్, సృజన్,మాన్య, ప్రభాకర్, మా ధవి, వనజ, అనిత, శోభ తదితర ఉపాధ్యాయులు పా ల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా 6వ వార్డులో ఉచిత వైద్య శిబిరం

- కౌన్సిలర్ సయ్యద్ గఫార్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు.. ఉచితంగా హోమియోపతి మందుల పంపిణీ.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/నవంబర్ 21/అక్షరం న్యూస్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీ సుకురావాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధి లోని 6వ వార్డులో కౌన్సిలర్ సయ్యద్ గఫార్ ఆధ్వర్యం లో శనివారం ఉచిత హోమియోపతి వైద్య శిబిరాన్ని ని ర్వహించారు. ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధనా సంస్థ, విజయవాడ వారి ఆధ్వర్యంలో ఆయుర్వేద మొబైల్ హె ల్త్ కేర్ ప్రోగ్రామ్ -- షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్ పథకం కిం ద ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరానికివా ర్డు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. శిబిరానికి వచ్చిన ప్రజలకు ప్రముఖ హోమియోపతి వైద్యులువై ద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను అ డిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి తగిన వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా హోమియో పతి మందులను పంపిణీ చేశారు.సాధారణ ప్రజలు వై ద్య సేవల కోసం ఇబ్బందులు పడకుండా,తమ ప్రాంతం లోనే ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకునే అవకా శం కల్పించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని నిర్వాహ కులు తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కు టుంబాలకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉప యోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.ప్రజలు తమ ఆ రోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అందుబాటులో ఉ న్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సం దర్భంగా సూచించారు. వార్డు ప్రజలకు వైద్య సేవలుఅం దించేందుకు ముందుకొచ్చిన ప్రాంతీయ ఆయుర్వేద పరి శోధనా సంస్థకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.ఈకా ర్యక్రమంలో హోమియోపతి వైద్యులు, మాజీ ఎంపీటీసీ సభావత్ అలీ, తౌఫిక్, ఆశా వర్కర్ లావణ్యతో పాటు 6 వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం

- మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ మత్తమాల భాగ్యవతి.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/నవంబర్ 21/అక్షరం న్యూస్: నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చే యడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిర మ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో సంతోషాన్ని నింపుతోం దని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మత్తమాల భాగ్యవతి అన్నారు.ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు లో హమాలి కుక్కల కిష్టయ్య కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుక లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు సమకూర డం ఎంతో ఆనందకరమని,ప్రతి పేదవాడికి సొంత నివా సం కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి ఇందిరమ్మ ఇళ్ల ప థకం నిదర్శనమని పేర్కొన్నారు. అనంతరం మాజీ పీ ఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ కుక్కల కి ష్టయ్య కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపా రు. 7వ వార్డును గుడిసెలు లేని వార్డుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వెల్లడించారు.ఇటీవల వార్డులో 31మం దికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయని, వారికి మంజూరు పత్రాలు అందజేశామని తెలిపారు.అదేవిధం గా వార్డులో సీసీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నా యని పేర్కొన్నారు.వార్డు అభివృద్ధికి సహకరిస్తున్నఎ మ్మెల్యే మదన్ మోహన్ రావు, మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, కమిషనర్ జగ్జీవన్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్య లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మాజీ పీఏసీఎస్ వైస్ చై ర్మన్ ప్రశాంత్ గౌడ్, కౌన్సిలర్లు సయ్యద్ గఫార్, తిరుపతి, శివానంద్, దశరథ్, కోఆప్షన్ సభ్యులు వసీం, వహీద్, ప ప్పు వెంకటి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం సందర్భంగా మోహినికుంట పాఠశాలలో వనభోజన కార్యక్రమం



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -21(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండలం మోహినికుంట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కార్తీక మాసం సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం వనభోజన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.మోహినికుంట మాజీ సర్పంచ్, మాజీ రైతుబంధు అధ్యక్షులు కల్వకుంట్ల వనజ గోపాల్ రావు ఆధ్వర్యంలోలి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆనందోత్సాహాల మధ్య వనభోజన కార్యక్రమాన్ని జరుపుకున్నారు.వనభోజన కార్యక్రమానికిమోతే నర్సింలు గౌడ్‌లిమోతే పరశురాములు గౌడ్ సహకరించడం తో వారి కీ శాలువా తో సన్మానించారు ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ బిల్లం మురళీ,ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు కల్వకుంట్ల శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ నారాయణోజు సంధ్య, వార్డు సభ్యులు సుమన్, సకేత్, సోనీ, మోహినికుంట బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు నారాయణోజు సతీష్.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభా , శ్రీనివాస్ రావు, ఉపాధ్యాయులు కరుణశ్రీ , స్రవంతి , కదిరే పరశురాములు గౌడ్, అంగన్‌వాడీ టీచర్ పల్లాటి భాగ్య , పాఠశాల చైర్మన్ మెరుగు స్రవంతి. జంపెల్లి అంజయ్య, జంపెల్లి దేవయ్య, మెరుగు నాంపల్లి గౌడ్, రాజాం బాబు, సోమర్‌పేట రాకేష్, బిల్లం సురేష్, యాసీం, పల్లాటి వెంకటి, యాదగిరి, బొల్లవేణి వెంకటమ్మ, ఎడ్ల లక్ష్మీ నరసవ్వ, రాధమ్మ, ఎడ్ల రాజ నరసవ్వ, రజిత తదితరులు పాల్గొన్నారు

సింగరేణి మాజీ ఉద్యోగులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు

- ఈ నెల 23 నుంచి 25 వరకు ప్రత్యేక శిబిరం



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

సింగరేణి మాజీ ఉద్యోగులు పెన్షన్ పొందేందుకు ప్రతి సంవత్సరం సమర్పించాల్సిన డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల కోసం రామగుండం ఏరియా-1లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినట్లు సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజుల పాటు జీఎం కార్యాలయంలోని ఆర్జీ-1 కార్యాలయంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపింది.సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంపీఐఎఫ్) అధికారులు ఈ శిబిరం ద్వారా పెన్షనర్ల డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల నమోదు ప్రక్రియ చేపట్టనున్నారు. పెన్షన్ పొందుతున్న మాజీ ఉద్యోగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని అధికారులు సూచించారు.శిబిరానికి వచ్చే మాజీ ఉద్యోగులు పెన్షన్ పే ఆర్డర్ ప్రతితో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ పొందేందుకు సెల్‌ఫోన్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కోరారు. ఈ మేరకు రామగుండం ఏరియా-1 అధికార ప్రతినిధి శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ మంగమ్మకు సన్మానం

- మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన ఎమ్మార్పీఎస్, బహుజన జన సంఘం నాయకులు.



కామారెడ్డి జిల్లా/ఎల్లారెడ్డి/నవంబర్ 21/అక్షరం న్యూస్: ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ మంగమ్మను మాదిగ రాజకీయపో రాట సమితి (ఎమ్మార్పీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్. బాగయ్య, బహుజన జనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర శివరాజ్, కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు సత్తి బుజ్జమ్మ శ నివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఐ మంగమ్మకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు ఆమెతో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, బహుజన జ న సంఘం నాయకులు పాల్గొన్నారు.

24న జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు

- సూర్యాపేటలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ :

గోదావరిఖని ప్రభుత్వ పీజీ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 24న జిల్లా స్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భాషబోయిన వాసు, కోచ్ రాజుల బిందుజ తెలిపారు. సీనియర్స్ మహిళలు, పురుషులతో పాటు అండర్--17 బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు.జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, ఆసక్తి ఉన్నవారు ఈ నెల 24న ఉదయం 9 గంటలకు గోదావరిఖని ప్రభుత్వ పీజీ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకోవాలని సూచించారు. సీనియర్స్ విభాగంలో 18 ఏళ్లు పైబడిన వారు, జూనియర్స్ విభాగంలో 2009 జనవరి 1 నుంచి 2011 జనవరి 1 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు.జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలోని టీజీ ఆర్‌జేసీ బాలుర విభాగంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. జిల్లా క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

వన్యప్రాణుల దాడుల బాధితులకు పరిహారంపై అవగాహన

- ఉచిత న్యాయ సహాయంపై గ్రామస్తులు, విద్యార్థులకు వివరణ



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : మానవ--వన్యప్రాణుల సంఘర్షణల్లో నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం, సహాయంపై అవగాహన కల్పించేందుకు పెద్దపల్లి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పెద్దంపేట గ్రామంలో, రామగుండంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వన్యప్రాణుల దాడుల కారణంగా సంభవించే ప్రాణ, ఆస్తి నష్టాలు, గాయాలు, పంట నష్టాలకు సంబంధించి బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం, సహాయ వివరాలను గ్రామస్తులకు, విద్యార్థులకు వివరించారు. మానవ--వన్యప్రాణుల సంఘర్షణ బాధితుల పథకం--2025 కింద అర్హత కలిగిన వారు ఎవరు, పరిహారం పొందేందుకు ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన పత్రాలు ఏమిటి అనే అంశాలపై అవగాహన కల్పించారు. బాధితులు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే విధానాన్ని వివరించారు.అలాగే విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం గురించి అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేసి గ్రామస్తుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమ్ముల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నవీన్, నుచ్చు శ్రీనివాస్, భాను కృష్ణ, న్యాయ సేవా సంస్థ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ. మాధవి, డిప్యూటీ ఫారెస్ట్ ఆఫీసర్ జి. కొమురయ్య, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సయ్యద్ రహిమతుల్లా, గ్రామస్తులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలను జాతీయ వేదికపై వినిపించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

- జాతీయ స్థాయి సమావేశంలో కార్మికుల హక్కులు, సంక్షేమం, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ప్రస్తావన



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : మధ్యప్రదేశ్‌లో జరుగుతున్న ఇండియన్ నేషనల్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎన్ఎంఎఫ్) 33వ జాతీయ మహాసభల్లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐఎన్‌టీయూసీ నాయకులు జాతీయ స్థాయిలో ప్రస్తావించారు. నవంబర్ 21, 22 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ మహాసభలకు సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ తరఫున సీనియర్ ఉపాధ్యక్షుడు త్యాగరాజన్, ప్రధాన కార్యదర్శి వికాస్ కుమార్ యాదవ్ హాజరై ప్రసంగించారు.ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సమావేశానికి హాజరైన నాయకులు సింగరేణి సంస్థలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత, భవిష్యత్తు సవాళ్లను జాతీయ స్థాయి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. బొగ్గు పరిశ్రమకు సంబంధించిన జేబీసీసీఐలో ఐఎన్‌టీయూసీ, ఐఎన్ఎంఎఫ్‌లకు ప్రాతినిధ్యం, వేతన ఒప్పందాల అమలు, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం, కార్మిక హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై చర్చించారు.ముఖ్యంగా సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా బోనస్ అందించేందుకు ఐఎన్‌టీయూసీ చేసిన కృషిని ఈ సందర్భంగా వివరించారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ చేస్తున్న పోరాటాలు, కార్మికులకు మెరుగైన హక్కులు, సౌకర్యాలు కల్పించేందుకు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణను సమావేశం దృష్టికి తీసుకెళ్లారు.దేశవ్యాప్తంగా వివిధ బొగ్గు పరిశ్రమలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొంటున్న ఈ మహాసభలు కార్మిక సమస్యలపై పరస్పర అభిప్రాయాల మార్పిడికి, జాతీయ స్థాయిలో ఐక్య పోరాటాలకు దోహదపడనున్నాయి. సింగరేణి కార్మికుల సమస్యలను జాతీయ వేదికపై వినిపించేందుకు ఈ సమావేశం మంచి అవకాశంగా నిలిచిందని నాయకులు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, మెరుగైన పని పరిస్థితుల సాధన కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడుతుందని వారు స్పష్టం చేశారు.

కార్మిక హక్కుల సాధనకు చలో ఢిల్లీ

- డిసెంబర్ 1 నుంచి 3 వరకు పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలి
- కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలి: దండ రాఘవరెడ్డి, గీట్ల లక్ష్మారెడ్డి



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని రామగుండం ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) వర్కింగ్ ప్రెసిడెంట్ దండ రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన 'చలో ఢిల్లీ' పోస్టర్లు, కరపత్రాలను శనివారం ఎన్టీపీసీ ప్లాంట్ గేట్-2 వద్ద యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీట్ల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు గడిచినా కార్మికుల వేతనాలు, ఆదాయం, పెన్షన్లలో ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. కార్మికుల శ్రమతో సంపద సృష్టిస్తున్న యజమానులు కుబేరులవుతుంటే, కార్మికుల జీవన ప్రమాణాలు మాత్రం మెరుగుపడటం లేదన్నారు. పాలకవర్గాలు కార్మిక సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు.కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేయడం ద్వారా కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి ముప్పు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పథకాల కింద పనిచేస్తున్న కార్మికులందరినీ క్రమబద్ధీకరించి శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.42 వేలు అమలు చేయడంతో పాటు పెన్షన్లను పెంచాలని డిమాండ్ చేశారు.కార్మికుల హక్కుల సాధన కోసం డిసెంబర్ 1న ఢిల్లీకి తరలివెళ్లి పార్లమెంట్‌ను ముట్టడించాలని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులతో పాటు అన్ని రంగాలకు చెందిన కార్మికులు ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దండ రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి గీట్ల లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులు కదాశి మల్లేష్, టి.రవీందర్, ఏ.చంద్రమౌళి, వి.శ్రీనివాస్, ఎండీ తాజుద్దీన్, శ్రీనివాస్, మురళి, రమణారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని మెడికల్ కళాశాలలో సి పి ఆర్ ప్రదర్శన

- ప్రాణాలను కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం: రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూలి



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు హృదయ-శ్వాస పునరుద్ధరణ (సి పి ఆర్)పై ప్రతి ఒక్కరి కి ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు.రాష్ట్రంలోనే తొలిసారిగా వైద్య విద్యార్థులు, పోలీసు సిబ్బందితోపాటు సుమారు 1000 మంది విద్యార్థులకు రామగుండంలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిమ్స్)లో డాక్టర్ శివరంజని సంతోష్ సీపీఆర్ పై సులువుగా అర్థమయ్యేలా శిక్షణా ఇచ్చారు. గుడ్ విల్ ఫౌండేషన్ తెలంగాణ సహకారంతో నిర్వహించిన సిపిఆర్ శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ హాజరయ్యారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రమాదాలు,ఆకస్మిక గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో బాధితుడికి వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ చేయడం ఎంతో కీలకమని తెలిపారు. సరైన సమయంలో, సరైన పద్ధతిలో సీపీఆర్ అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు.సీపీఆర్ శిక్షణను కేవలం తమపని ప్రదేశంలోనే కాకుండా,బయట కూడా అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సీపీఆర్ చేసే విధానాన్ని ప్రతి ఒక్కరూ పూర్తిగా నేర్చుకోవడంతో పాటు,అవసరమైన సమయంలో ధైర్యంగా స్పందించాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో తొలి స్పందన చాలా ముఖ్యమని,వైద్య సహాయం అందేలోపు సీపీఆర్ అందించడం ద్వారా ఒక ప్రాణాన్ని నిలబెట్టే అవకాశం ఉంటుందని సీపీ తెలిపారు.అందుకే ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.అనంతరం విద్యార్థులు,పోలీస్ సిబ్బందికి సీపీఆర్ ప్రాథమిక విధానాలను వివరించి,డమ్మీపై ప్రాక్టికల్ డెమో నిర్వహించారు. విద్యార్థులు,పోలీస్ సిబ్బందితో కలిసి సీపీ స్వయంగా సీపీఆర్ చేస్తూ శిక్షణలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,డాక్టర్ దయాల్ సింగ్, డాక్టర్ హిమబిందు, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లింగమూర్తి,ఆర్ఐ శేఖర్,ఎస్ఐలు మనోహర్, రాజశేఖర్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి మహా హారతిలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలి

- క్యాతం వెంకటరమణ పిలుపు



జ్యోతినగర్, ఎన్టీపీసీ నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గోదావరి నదీమ తల్లికి నిర్వహించే మహా హారతి కార్యక్రమాల్లో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని గోదారి హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ కోరారు.గోలివాడ గోదావరి తీరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న మహా హారతి కార్యక్రమంలో పరిసర ప్రాంతాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం అంతర్గాం ప్రాంతంలోని మహిళా సంఘాల నాయకురాళ్లతో సమావేశమై కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. కార్తీక మాసంలో గోదావరి నదిలో కార్తీక దీపాలను వదలడం పవిత్రమైన ఆచారమని, నదీమ తల్లి ఆశీస్సులతో కుటుంబాల్లో సుఖసంతోషాలు, సకల సౌభాగ్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. మహిళలు గోదావరి తీరానికి చేరుకుని దీపాలు వదిలి మహా హారతిలో పాల్గొనాలని కోరారు.అదేవిధంగా ఈ నెల 25వ తేదీ బుధవారం సాయంత్రం గోదావరిఖనిలోని సమ్మక్క--సారలమ్మల జాతర స్థలంలో నిర్వహించనున్న గోదావరి మహా హారతి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శనివారం బస్టాండ్ కాలనీలోని వెంకటేశ్వర దేవాలయంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్తీక మాసంలో నదిలో దీపారాధనకు విశేష ప్రాముఖ్యత ఉందన్నారు. దేవాలయాల్లో దీపారాధన కంటే గోదావరి నదిలో దీపాలు వదలడం వెయ్యి రెట్లు పుణ్యఫలాన్ని ఇస్తుందని వేదాలు, పురాణాల్లో పేర్కొన్నట్లు వివరించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని గోదావరి ఒడిలో కార్తీక దీపాలు వదిలి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో క్యాతం వెంకటరమణతో పాటు కందలోకనాదం, మాడ ప్రభాకర్ రెడ్డి, గోటీకాడి శ్రీనివాసు, గొడిసెల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల ఎస్సీ హాస్టల్‌లో నూతన విద్యార్థి కమిటీ ఏర్పాటు..



సూర్యాపేట /నేరేడుచర్ల/ నవంబర్ 21 అక్షరం న్యూస్

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నేరేడుచర్ల ఎస్సీ హాస్టల్‌లో నూతన విద్యార్థి కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడు మిడతపల్లి శ్రీను మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇంజమూరి మల్లయ్య, ఎడవల్లి చంద్రయ్య, ఎడవల్లి అరుణ మాట్లాడుతూ 32 ఏళ్ల ఉద్యమ పోరాట ఫలితంగా సాధించిన ఎస్సీ వర్గీకరణ ఫలాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. ఎస్సీ హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం వెంటనే నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బరిగల రిషి, ఉపాధ్యక్షుడిగా ముండ్ల అఖిల్, ప్రధాన కార్యదర్శిగా రణపొంగు కార్తీక్, అధికార ప్రతినిధిగా చింతలచెరువు అఖిల్, కోశాధికారిగా బరిగల రాకేష్‌తో పాటు ఇతర విద్యార్థులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలి



సూర్యాపేట నేరేడుచర్ల నవంబర్ 21 అక్షరం న్యూస్

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మై భారత్ కేంద్రం--సూర్యాపేట ఆధ్వర్యంలో 2026--27 సంవత్సరానికి నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని 'నషా ముక్త్ యువ' ఇతివృత్తంతో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని, మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఐ గోపాల్ రెడ్డి చట్టాలపై అవగాహన కల్పించగా, సూర్యాపేట ఎస్పీ కార్యాలయ పోలీస్ కళాబృందం ఎల్లయ్య ఆధ్వర్యంలో పాటల ద్వారా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నీరజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వనపర్తి శ్రీనివాసులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఆర్ఎఫ్‌సీఎల్‌లో అమ్మోనియా గ్యాస్

లీకైతే ఎదుర్కొనే పద్ధతిని మాక్ డ్రిల్ చేసిన పోలీసులు

- అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు మాక్ డ్రిల్స్ కీలకం: రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



జ్యోతి నగర్ ఎన్టిపిసి నవంబర్ 21 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని ఎన్టీపీసీ ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలో అమ్మోనియా గ్యాస్ లీకేజీ సంభవించిన పక్షంలో చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అత్యవసర రక్షణ, సహాయక చర్యలపై ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ,సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ మాక్ డ్రిల్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆకస్మికంగా పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, ప్రమాదకరమైన పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో, సమర్థవంతంగా స్పందించకపోతే ప్రాణ,ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో భద్రతా సిబ్బంది అనుసరించాల్సిన విధానాలు, ప్రమాద తీవ్రతను నియంత్రించడం, బాధితులను సురక్షితంగా రక్షించడం వంటి అంశాలపై క్షేత్రస్థాయి ప్రాక్టికల్ అవగాహన కల్పించడమే మాక్ డ్రిల్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

మాక్ డ్రిల్స్ నిర్వహించడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో వివిధ విభాగాల సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించే సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు.అలాగే భద్రతా ఏర్పాట్లలో ఉన్న లోపాలను ముందుగానే గుర్తించి,వాటిని సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు.

స్థానిక పోలీస్ యంత్రాంగం, పరిశ్రమల భద్రతా విభాగాలు,రెస్క్యూ బృందాలు,ప్రాజెక్టు నిర్వహణ సిబ్బంది మధ్య పరస్పర సమన్వయం మరింత బలోపేతం కావడానికి ఇటువంటి మాక్ డ్రిల్స్ ఎంతగానో దోహదపడతాయని సీపీ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే లక్ష్యంగా అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని విభాగాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సంసిద్ధంగా ఉండాలని సీపీ సూచించారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, ఎన్టీపీసీ ఎస్ఐలు వెంకట స్వామి, ప్రవంతి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి,ఎన్టీపీసీ అధికారులు, రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలు, ఆంగ్ల భాషా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ...



సూర్యాపేట/నేరేడుచర్ల/ నవంబర్ 21 అక్షరం న్యూస్

మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ సంబరాల టాలెంట్ టెస్ట్‌లో ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ, పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల ద్వితీయ స్థానాలు సాధించాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ప్రథమ, పినాకిల్ ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. గురుకుల పాఠశాలల విభాగంలో రామాపురం బీసీ గురుకుల బాలుర పాఠశాల ప్రథమ, బీసీ గురుకుల బాలికల పాఠశాల ద్వితీయ స్థానాలు సాధించాయి. అదేవిధంగా జిల్లా ఆంగ్ల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఆంగ్ల భాషా ప్రావీణ్య పోటీల్లో పెంచికల్ దిన్నె పాఠశాలకు చెందిన పూజిత, శ్రీజ, నాగశ్రీ, పీఎం శ్రీ పాఠశాల నేరేడుచర్లకు చెందిన అక్షరదీపిక, భవ్యశ్రీ, సోమవారం ఉన్నత పాఠశాలకు చెందిన ప్రజ్ఞ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు నేరేడుచర్ల లయన్స్ క్లబ్ సౌజన్యంతో బహుమతులు, ప్రశంసాపత్రాలను పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు నేతృత్వంలో అందజేశారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు గుండ్రెడ్డి సైదిరెడ్డి, సభ్యులు గుండా సత్యనారాయణ, కొప్పు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఎం. సైదులు, ఆర్. మానస, ఎం. భానుమతి, ఎన్. విజయ్ రామానుజం, ఎన్. వెంకటేశ్వర్లు, నారాయణమ్మ, సైదయ్య, జానకిరాములు, శౌరి, నరసింహారావు, రషీద్ ఖాన్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి పుస్తె మట్టెలు అందజేత



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -21(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు చిప్పలపల్లి గ్రామానికి చెందిన సుద్దాల జ్యోతి హనుమయ్య రెండవ కూతురు తన్విక వివాహం ఆదివారం జరుగనుండడం తో మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోమ్మట రాజమల్లు వెంకటశ్వర్ రావు కు తెలపడంతోనే మంచి మనసుతో స్పందించి పుస్తె మట్టెలు ఇవ్వడం తో వాటిని వధువు తల్లి తండ్రులకు అందచేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాడిచర్ల శ్రీనివాస్, ఉప సర్పంచ్ రామచంద్రము మాజీ ఏఎంసి డైరెక్టర్ సుద్దాల రాజయ్య, కొమ్మటి శ్రీనివాస్ పారిపెల్లి కాశయ్య తదితరులు పాల్గొన్నారు, సుద్దాల జ్యోతి హనుమయ్య చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ మహా పాదయాత్రపై విస్తృత స్థాయి సన్నాహక సమావేశం

- కార్యాచరణ పై చర్చ



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -21(అక్షరం న్యూస్)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) కాంగ్రెస్, ఇండి కూటమి చేస్తున్న దుష్ప్రచారం ను తిప్పి కొట్టడానికి భారతీయ జనతా పార్టీ ముస్తాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు సౌల్ల క్రాంతికుమార్ అధ్యక్షతన గూడెం మహేశ్వర గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి జిల్లా ప్రధానకార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ లు హాజరయ్యారుఈ సమావేశంలో ఈ నెల 23వ తేదీన కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహించనున్న మహాపాదయాత్రకు సంబంధించిన సన్నాహాలపై చర్చించారు మహాపాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ ముఖ్య అతిథిగా విచ్చేయనున్న నేపథ్యంలో, కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సమావేశంలో పిలపు నిచ్చారు'సర్' పేరిట రాజ్యాంగ సంస్థలపై ఇండీ కూటమి పేరుతో విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలు వివరించేందుకు "ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకత్వాన్ని పాతరేద్దాం" పేరిట కరీంనగర్ లో నిర్వహించే మహా పాదయాత్రలో పాల్గొనాలని తెలిపారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు సూచించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ లు మట్ట వెంకటేశ్వర్ రెడ్డి , నక్కదాసరి రవి,మెంగని శ్రీనివాస్,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు మల్లారపు సంతోష్ రెడ్డి,జిల్లా కార్యదర్శి మీస సంజీవ్,మాజీ అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి,మండల ప్రధానకార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ,బుచ్చేలి మహేశ్వరి,ఎస్సి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మీస స్వామి,కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల సత్యం రెడ్డి,చిట్నే ని శ్రీనివాస్ రావు, జిల్లెల్ల మల్లేశం,ఉపసర్పంచ్ లు నక్క రాజు,బట్టు నవీన్,జనార్దన్,మండల ఉపాధ్యక్షులు బెదుర ప్రశాంత్,కాసోడి రమేష్,బాధ నరేష్,చిగురు వెంకన్న,శక్తికేంద్ర ఇంచార్జిలు దీటి సత్తయ్య,శ్రావణ్, నవీన్, తిరుపతి,బూత్ అధ్యక్షులు పున్నం అనిల్, కర్ణాకర్,బీజేపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

ఘనంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి 418వ జయంతి వేడుకలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /నవంబర్ -21(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలోకాలజ్ఞాన ప్రవక్త, యుగపురుషుడు జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 418వ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారుస్థానిక హనుమాన్ దేవాలయం లో బ్రహ్మం గారి చిత్ర పటానికి పూజలు చేసి పూల మాలలు సమర్పించారు పరమత సహనాన్ని, సర్వమానవ కల్యాణాన్ని ఆకాంక్షించి అనుసరింపజేసిన మహోన్నత ఆశయవాది పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమాలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ ఉప సర్పంచ్ రాంచంద్రం, జెల్ల శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి నరేష్, సుద్దాల దేవయ్య వెంకట నరసయ్య,బాల కొమురయ్య,, వెంగళం శ్రీనివాస్ మారెపు అశోక్, రాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాతృ మాండలికంలో పాటలు రాసే అదృష్టం దక్కింది



“భోగి’ తెలంగాణ పల్లెటూరి బతుకు చిత్రం. అక్కడి జీవితాన్ని, పల్లీయుల సంస్కృతిని అచ్చమైన మాండలికంలో ఆవిష్కరించే గొప్ప అదృష్టం ఈ సినిమా పాటల ద్వారా కలిగింది’ అన్నారు ప్రముఖ గీత రచయిత చంద్రబోస్. ఆయన సాహిత్యాన్ని అందించిన పీరియాడిక్ చిత్రం ‘భోగి’ ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకురానుంది. శర్వానంద్ కథానాయకుడిగా సంపత్‌నంది దర్శకత్వంలో లక్ష్మీ రాధామోహన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం చంద్రబోస్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ పాటల విశేషాల్ని పంచుకున్నారు.

‘భోగి’ సినిమాలో నా మాతృ మాండలికంలో పాటలు రాయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా. గతంలో మల్లేశం, ఛాంపియన్ చిత్రాల్లో తెలంగాణ మాండలికంలో పాటలు రాశాను. అయితే ‘భోగి’లో అత్యంత సహజమైన, స్వచ్ఛమైన తెలంగాణ మాండలికంలో పాటలు రాసే అవకాశం దక్కింది. నా బాల్యంలో నేను మాట్లాడినవి, విన్నవి, పరిశీలించిన మాటలను ఈ సినిమా పాటల్లో పొందుపరిచాను.

సినిమా కవి ప్రతి మాండలికంలోనూ పాటను రాసే పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి. ‘రంగస్థలం’లో గోదావరి యాసను, ‘పుష్ప’ చిత్రంలో చిత్తూరు యాసలో పాటల్ని రాశాను. అయితే ‘భోగి’ సినిమా విషయంలో నాకు ఎవరి దగ్గరి నుంచి ఎలాంటి సమాచారాన్ని తీసుకోవాల్సిన అవసరం రాలేదు. ఎందుకంటే ఒక్కసారి కళ్లుమూసుకుంటే నా ఊరి మూలాల్లోకి వెళ్లిపోతాను. తెలంగాణ మూలాల్లోని తడి నా హృదయం నుంచి ఎప్పటికీ వీడిపోదు.

నేను కాలేజీ రోజుల్లోనే మా ఊరి నుంచి హైదరాబాద్ వచ్చాను. కానీ నా గ్రామం తాలూకు పరిసరాలు, అక్కడి భాష, మాండలికం.. ఇవన్నీ నాలో ఇంకా పదిలంగానే ఉన్నాయి. నా మాతృమాండలికంలో ‘భోగి’ సినిమా పాటలు రాయడం వ్యక్తిగతంగా చాలా సంతోషాన్నిచ్చింది. ఈ కార్యంలో నేను సఫలమయ్యానని భావిస్తున్నా.

ఈ సినిమాలోని ‘ఎగిలివారంగ’ అనే పాటలో పొద్దున లేచిన దగ్గరి నుంచి రాత్రి నిద్రపోయే వరకు పల్లెటూరి వారి దినచర్యతో పాటు అక్కడి కులవృత్తులు, దైవిక ఆచారాల్ని తెలియజేసే ప్రయత్నం చేశా. మొత్తంగా ఓ గ్రామ జీవితానికి దర్పణంలా ఈ పాట ఉంటుంది. నా దృష్టిలో ప్రతీ పాట ఓ కథలా ఉండాలి. దానికి అందమైన ప్రారంభం, కొనసాగింపు, ముగింపు ఉండాలి. ‘ఎగిలివారంగ’ పాట విషయంలో ఇవన్నీ చక్కగా కుదిరాయి. సినిమా తాలూకు కథను పాట ద్వారా చెప్పే ప్రయత్నం చేశా.

సంగీత దర్శకుడు భీమ్స్‌తో గతంలో కూడా పనిచేశాను. తను ప్రజల సంగీత దర్శకుడు. నేనంటే చాలా అభిమానం. నా స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చానని చెబుతుంటాడు. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలుంటాయి. అన్నీ సందర్భోచితంగా వచ్చేవే. ఏ పాటకైనా ముందు సాహిత్యం రాసి, ఆ తర్వాత స్వరాల్ని సమకూర్చితే అది ఎక్కువ కాలం నిలుస్తుందని నేను ప్రగాఢంగా విశ్వసిస్తాను. చరిత్రలో నిలిచిపోయిన గొప్ప పాటలన్నీ అలా తయారైనవే.

ఆర్.ఆర్.ఆర్‌లో పాటలు రాయడానికి 19 నెలల సమయం తీసుకున్నా. నేను ‘నాటు నాటు’ పాట కంటే ఎన్నో మంచి గీతాలు రాశాను. కానీ ఆ పాటకే ఎందుకు ఆస్కార్ వచ్చిందనే విషయంలో నా దగ్గర ఓ విశ్లేషణ ఉంది. అది ప్రేమగీతం కాదు. బంధాల్ని ఆవిష్కరించే గీతం కాదు. తాత్విక భావాలు ఏమీ లేవు. అది ఒక ఆడిపాడే పాట. అందుకే మిగతా పాటల కంటే ఆ పాట వందకి వంద మార్కులు కొట్టింది. ఆ సంవత్సరం ఈ పాటకు మించిన ఊర్రూతలూగించిన పాట ఏదీరాలేదు. ఆ పాట రాసే విషయంలో నేను చూపించిన సహనానికే అవార్డు వచ్చిందేమో (నవ్వుతూ). గీత రచయితగా 31 ఏండ్ల సాహితీ యజ్ఞంలో భగవంతుడు నన్ను ఆ పాట ద్వారా కరుణించాడేమో అనిపించింది.


ప్రస్తుతం నవతరం గీతరచయితలు మంచి పాటలు రాస్తున్నారు. భాషా పటిమ కంటే సరికొత్త భావాల్ని వ్యక్తం చేసే ప్రయత్నం చేస్తున్నారు. సాధారణ పదాల్లోనే లోతైన భావాలు, తాత్వికతను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడొస్తున్న ప్రతీ పాటలకు ఓ ప్రత్యేకత కనిపిస్తున్నది. గీత రచనలో భావవ్యక్తీకరణ కొత్తగా ఉండాలి. భావంలో నవ్యత ఉంటే సాధారణ వ్యవహారిక భాషలోనే అద్భుతమైన పాటల్ని సృష్టించే వీలుంటుంది.

హనుమాన్-2 ది రైజ్ ఆఫ్ వానరాస్



‘హను-మాన్’ యూనివర్స్ నుంచి మరో ప్రతిష్టాత్మక ఫాంటసీ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ‘హను-మాన్’ నిర్మాతలైన కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి తమ ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘హనుమాన్ 2 – – ది రైజ్ ఆఫ్ వానరాస్’ పేరుతో రానున్న ఈ చిత్రంలో ‘ఉప్పెన’ ఫేం పంజా వైష్ణవ్‌తేజ్ హీరోగా నటిస్తారు. వీఐ ఆనంద్ దర్శకుడు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఎనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమా కథాంశంపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఆకాశమంత ఎత్తులో ఆంజనేయుని తోక.. ఆ తోకపై నిలబడివున్న ఓ వ్యక్తి.. అతని చుట్టూ అలముకొని ఉన్న మేఘాలు.. ఎదురుగా ఆంజనేయుని విశ్వరూప సందర్శనం.. ఇవన్నీ ఈ పోస్టర్‌లో చూడొచ్చు. బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ‘హను-మాన్’ స్థాయిని మరింత పెంచేలా ఈ సీక్వెల్ ఉండబోతున్నదని, అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని అందించే ఓ మైథలాజికల్ ప్రపంచాన్ని ఈ సినిమా ఆవిష్కరించనున్నదని మేకర్స్ తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

గోపాలకృష్ణుడు నందబాలుడు



గ్రామీణ తెలంగాణ నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్న చిత్రం ‘ఇడుపు కాయితం’. ప్రియదర్శి, నాగదుర్గ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని బన్నీ వాస్, తబిత సుకుమార్ నిర్మిస్తున్నారు. వంశీ రెడ్డి దొండపాటి దర్శకుడు. డిసెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. శనివారం ఈ సినిమా నుంచి ‘గోగులు గోగులు’ అనే పాటను విడుదల చేశారు. సురేష్ బొబ్బిలి స్వరపరచిన ఈ పాటకు కొంగరి కృష్ణ సాహిత్యాన్ని అందించారు. అభిక్య తనికెళ్ల, రచిత రాయప్రోలు, జయశ్రీ పల్లెం, స్నిగ్ధ శర్మ ఆలపించారు. ‘గోగులు గోగులు గోపాలకృష్ణుడు సేలి.. గోపాలకృష్ణుడు ఆనంద బాలుడు.. నందకుమారుడు రమ్మనరే రమ్మనరే నలుగుకు నా ముద్దు గోపాలకృష్ణున్ని’ అంటూ నాయకానాయికల వివాహ వేడుక నేపథ్యంలో ఈ పాటను చిత్రీకరించారు. పెళ్లి తాలూకు సంబరాన్ని అందంగా ఆవిష్కరిస్తూ కలర్‌ఫుల్ విజువల్స్‌తో ఈ పాట సాగింది. ఈ చిత్రానికిసంగీతం:సురేష్‌బొబ్బిలి, రచన-దర్శకత్వం:వంశీరెడ్డి దొండపాటి.

మా హామీ నువ్వే.. శివగామీ నువ్వే



సంక్రాంతి పండుగ అంటేనే బంధువుల సందడి, ఆప్యాయతలు, ఆటపాటలకు వేదిక. అలాంటి పండుగ వాతావరణాన్ని అందంగా ఆవిష్కరిస్తూ ‘జనవరి 12 విడుదల’ చిత్రం నుంచి ‘డివికి డివికి’ అనే పాటను విడుదల చేశారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేష్, కృతిశెట్టి ప్రధాన పాత్రల్లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 12న ప్రేక్షకుల ముందుకురానుంది. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను అనంత శ్రీరామ్ రచించారు. మధుప్రియ, హరిప్రియ ఆలపించారు. ‘వదినా వయ్యారి, వదినా బంగారి, వదినా ఎవరైనా నీకన్నానా.. వదినా పువ్వంటి, వదినా నిప్పంటి, వదినా నీకే తందానానా.. మా హామీ నువ్వే, శివగామీ నువ్వే’ అంటూ ఉత్సాహభరితమైన బీట్స్‌తో ఈ పాట సాగింది. కథానాయికలు కీర్తి సురేష్, కృతిశెట్టి సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోతూ హుషారెత్తించే డ్యాన్స్ మూమెంట్స్‌తో ఆకట్టుకున్నారు. వదినా, మరదళ్ల మధ్య ఉండే అనుబంధం, ఆప్యాయతల్ని ఆవిష్కరిస్తూ ఈ పాట ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సాహు గారపాటి నిర్మాత.

కొత్త పాత్ర కోసం కసరత్తులు




బ్లాక్‌బస్టర్ ‘రంగస్థలం’ తర్వాత సుకుమార్ దర్శకత్వంలో రామ్‌చరణ్ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా కోసం ఓ క్రేజీ సబ్జెక్ట్‌ని సుకుమార్ సిద్ధం చేసినట్టు వినికిడి. ఇందులో రామ్‌చరణ్ పాత్ర ఆయన కెరీర్‌లోనే అత్యంత బరువైనది, విభిన్నమైనదిగా ఉంటుందని ఇన్‌సైడ్ టాక్. ‘పెద్ది’ సినిమా కోసం లాంగ్ హెయిర్ పెంచి, ధృఢకాయుడిగా మారారు రామ్‌చరణ్. అలాగే ఈ సినిమాలోని పాత్ర కోసం కూడా ఒక ట్రైనర్‌ని పెట్టుకొని సినిమాకు కావాల్సిన కొత్త లుక్, పర్సనాలిటీ కోసం ఆయన కసరత్తులు మొదలుపెట్టారట. ఈ పాత్రకు కావాల్సిన స్క్రీన్ ప్రెజెన్స్‌ని అద్భుతంగా ప్రజెంట్ చేసే విషయంలో చరణ్ ఎక్కడా కాంప్రమైజ్ కావట్లేదు.ఈ పాన్ ఇండియా సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నదని సమాచారం. ఇందులో కథానాయిక ఎవరనేది చిత్రబృందం అధికారికంగా ప్రకటించలేదు. సారా అర్జున్, సాత్విక వీరవల్లి, రుక్మిణి వసంత్, భాగ్యశ్రీబోర్సే, శ్రీలీల.. ఇలా చాలామంది కథానాయికల పేర్లు వినిపిస్తున్నాయి. మైత్రీమూవీమేకర్స్, టీ-సిరీస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించే అవకాశం ఉన్నది.

తెలుగు ప్రేక్షకుల ముందుకు ‘ఫూలే’.. నవంబర్ 27న గ్రాండ్ రిలీజ్!



సామాజిక సంస్కరణల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహనీయులు జ్యోతిరావ్ ఫూలే, సావిత్రిబాయి ఫూలే జీవిత పోరాటం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ‘ఫూలే’. సమాజంలో నెలకొన్న కులవివక్ష, అసమానతలు, మహిళలపై వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఫూలే దంపతుల స్ఫూర్తిదాయక ప్రయాణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు అనంత్ మహదేవన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సుపదా క్రియేషన్స్ బ్యానర్‌పై డా. పొన్నం రవిచంద్ర నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. తెలుగు డబ్బింగ్ పనులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న థియేటర్లలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా వీక్షించింది. ఇక సినిమా వీక్షించిన అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. కులవివక్ష నిర్మూలన, మహిళా విద్య కోసం ఫూలే దంపతులు చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. వారి సామాజిక సేవ, జీవిత ఆశయాలు నేటి సమాజానికి అత్యంత అవసరమైన సందేశాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ‘ఫూలే’ కేవలం ఒక సినిమా మాత్రమే కాదని, సమాజంలో మార్పు కోసం పోరాడిన ఇద్దరు మహనీయుల జీవితాలను, వారు ఎదుర్కొన్న అడ్డంకులను కళ్లకు కట్టే ఒక చారిత్రాత్మక కథనమని చిత్ర బృందం పేర్కొంది. నేటి యువత, విద్యార్థులు ఫూలే దంపతుల జీవితం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, సమానత్వం, విద్య, మానవత్వం వంటి విలువలను గుర్తుచేసే ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ థియేటర్లలో వీక్షించి ఆదరించాలని నిర్మాత డా. పొన్నం రవిచంద్ర, చిత్ర బృందం విజ్ఞప్తి చేశారు.

అనిరుధ్, కావ్య మారన్ వివాహ వేడుక.. ఉద్యోగులకు బంగారం కానుకగా ఇచ్చిన సన్ గ్రూప్!



ప్రముఖ మీడియా దిగ్గజం సన్ గ్రూప్ తన కీలక ఉద్యోగులకు అదిరిపోయే కానుకలతో సర్‌ప్రైజ్ ఇచ్చింది. అనిరుధ్ మరియు కావ్య వివాహ రిసెప్షన్ విందు ఆహ్వాన పత్రికలతో పాటు సంస్థలోని ముఖ్య ఉద్యోగులకు బంగారు ఉంగరాలు, బంగారు నాణేలు, నూతన వస్త్రాలు మరియు స్వీట్లను సన్ గ్రూప్ యాజమాన్యం కానుకగా అందజేసింది. ఈ నెల 25వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంటకు (1:00 pm) చెన్నైలోని సన్ టీవీ ప్రధాన కార్యాలయంలో అనిరుధ్, కావ్యల వివాహ రిసెప్షన్ విందు వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ శుభకార్యానికి హాజరుకావాలని ఆహ్వానిస్తూ ఉద్యోగులకు ఇలా విలువైన బంగారు కానుకలు, కొత్త బట్టలు పంపడం పట్ల సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వివాహ ఆహ్వానం మరియు బహుమతులకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

పెదనాన్న సినిమాకు అరుదైన గౌరవం.. భావోద్వేగానికి గురైన ప్రభాస్

‘ఇఫీ’ వేదికపై ‘భక్త కన్నప్ప’ ప్రదర్శన

పెదనాన్న కృష్ణంరాజు సినిమాపై ప్రభాస్ ఎమోషనల్ పోస్ట్

ఎన్ని సంవత్సరాలు గడిచినా కొన్ని కథలు ఎప్పటికీ నిలిచిపోతాయని అగ్ర కథానాయకుడు ప్రభాస్ అన్నారు. తన పెదనాన్న కృష్ణంరాజు నటించిన క్లాసిక్ చిత్రం ‘భక్త కన్నప్ప’కు 57వ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో (ఇఫీ) అరుదైన గౌరవం దక్కడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బాపు దర్శకత్వంలో కృష్ణంరాజు, తన తండ్రి ఉప్పలపాటి సూర్యనారాయణ రాజు నిర్మించిన ఈ చిత్రం ‘ఇఫీ’లో ప్రదర్శితం కావడంపై ప్రభాస్ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించారు.“నేను చూస్తూ పెరిగిన సినిమా ఇది. పెదనాన్న నటించి, గోపీకృష్ణ మూవీస్ నిర్మించిన ఈ చిత్రానికి బాపు గారు ప్రాణం పోశారు. ఏళ్లు గడిచినా కొన్ని కథలు నిత్యనూతనంగా ఉంటాయి. ‘భక్త కన్నప్ప’ చిత్రాన్ని ఇఫీలో వేడుకగా జరుపుకుంటున్నందుకు గర్వంగా ఉంది. ఇది ఒక అందమైన వారసత్వం, నిజమైన గౌరవం” అని ప్రభాస్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ క్లాసిక్ చిత్రం 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా దీన్ని ప్రదర్శిస్తున్నారు.ఇక, ప్రభాస్ సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం ఆయన పలు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

సల్మాన్ ఖాన్ నుంచి ఐశ్వర్యా రాయ్‌ను కాపాడేందుకే నన్ను పెట్టారు: కేతన్ కరాండే

సల్మాన్ ఖాన్ నుంచి రక్షణ కోసమే ఐశ్వర్యా రాయ్ వద్ద బాడీగార్డ్‌గా చేరానన్న కేతన్ కరాండే

విక్రమ్ భట్ ఫ్యాషన్ షో తర్వాత కారుకు ఎదురుగా సల్మాన్ ఖాన్ వచ్చారని వెల్లడి

గొడవలకు దూరంగా ఉండేందుకే వెంటనే బాడీగార్డ్ ఉద్యోగం మానేశానని స్పష్టీకరణ

బాలీవుడ్‌లో రెండు దశాబ్దాల క్రితం నాటి సల్మాన్ ఖాన్, ఐశ్వర్యా రాయ్ బ్రేకప్ వ్యవహారం మరోసారి వార్తల్లో నిలిచింది. సల్మాన్ ఖాన్ నుంచి ఐశ్వర్యా రాయ్‌కు రక్షణగా ఉండేందుకే గతంలో తనను బాడీగార్డ్‌గా నియమించారని నటుడు, బాడీబిల్డర్ కేతన్ కరాండే తాజాగా వెల్లడించారు. ‘ఆర్ట్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్’ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను పంచుకున్నారు. ఎన్డీటీవీ కథనం ప్రకారం, దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఐశ్వర్య ‘కుచ్ నా కహో’ సినిమా షూటింగ్‌లో ఉన్న సమయంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి.

కేతన్ తెలిపిన వివరాల ప్రకారం... ఐశ్వర్యను ఇంటి నుంచి కారులో షూటింగ్ ప్రదేశాలకు సురక్షితంగా తీసుకెళ్లడమే తన ప్రధాన బాధ్యత. అయితే, ఫిల్మ్ మేకర్ విక్రమ్ భట్ నిర్వహించిన ఒక ఫ్యాషన్ షో ముగిసిన తర్వాత తాము కారులో బయల్దేరగా, సల్మాన్ ఖాన్ ఉన్నట్టుండి కారు ముందుకు వచ్చి నిలబడ్డారు. ఆ క్షణంలో తామంతా ఒక్కసారిగా భయపడిపోయామని కేతన్ గుర్తుచేసుకున్నారు. తాను కారు దిగేందుకు ప్రయత్నించగా, డ్రైవర్ వద్దని వారించి కారును చాకచక్యంగా పక్కకు తిప్పి వేగంగా తీసుకెళ్లిపోయారని చెప్పారు.



ఆ సమయంలో సల్మాన్ వద్ద ఆయుధం ఉండవచ్చని తాను భావించినట్లు కేతన్ సంజ్ఞల ద్వారా తెలిపారు. తాను అప్పట్లో బాడీబిల్డింగ్ కెరీర్‌పై దృష్టి పెట్టానని, శారీరక ఘర్షణల్లో తలదూర్చడం ఇష్టం లేక మరుసటి రోజే ఆ ఉద్యోగాన్ని వదిలేశానని వివరించారు. ప్రేమించుకున్న ఇద్దరి మధ్య వివాదంలో ఇరుక్కోవడం సరికాదని భావించినట్లు పేర్కొన్నారు. అయితే, కేతన్ కరాండే చేసిన ఈ వ్యాఖ్యలపై ఇప్పటివరకు అటు సల్మాన్ ఖాన్ గానీ, ఇటు ఐశ్వర్యా రాయ్ గానీ ఎలాంటి ప్రకటన చేయలేదు.

టాపార్డర్ జోరుతో తొలి టెస్టును శాసించే స్థితిలో భారత్



- కేఎల్ రాహుల్ రికార్డు శతకం
- రెండు పరుగులతో గిల్ సెంచరీ మిస్
- రాణించిన పడిక్కల్, పంత్
- ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 118 రన్స్ ఆధిక్యం

వెల్లింగ్టన్: టాపార్డర్ బ్యాటర్లు అదరగొట్టగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టుపై భారత్ పట్టు బిగించింది. ఓపెనర్ కేఎల్ రాహుల్ (290 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 136) రికార్డు శతకం బాదగా కెప్టెన్ గిల్ (146 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 98) రెండు పరుగులతో సెంచరీ మిస్ చేసుకున్నా ఫస్ట్ టెస్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి టీమిండియా 4 వికెట్ల నష్టానికి 486 రన్స్ చేసి టెస్టును శాసించే స్థితికి చేరింది. ఈ ఇద్దరికి తోడు దేవ్‌దత్ పడిక్కల్ (175 బంతుల్లో 10 ఫోర్లతో 80), రిషభ్ పంత్ (62 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 55 బ్యాటింగ్) ఫిఫ్టీ ప్లస్ స్కోర్లతో మెరిసిన వేళ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ ఇప్పటికే 118 పరుగుల కీలక ఆధిక్యం సాధించింది. కివీస్ బౌలర్లు రోజంతా బౌలింగ్ చేసినా 3 వికెట్లు మాత్రమే తీయగలిగారు. నాలుగో రోజూ గిల్ సేన ఇదే జోరుతో లంచ్ వరకు బ్యాటింగ్ చేసి తర్వాత ప్రత్యర్థి జట్టులో వీలైనన్ని ఎక్కువ వికెట్లు తీయగల్గితే మ్యాచ్ భారత్ చేతిలోకొచ్చినట్టే!

రాహుల్ క్లాస్.. పడిక్కల్ నిలకడ

తొలి రెండ్రోజుల పాటు ఉదయం సెషన్‌లో బౌలర్లకు సహకరించిన పిచ్‌లో మూడో రోజూ అదేతీరుగా స్పందింస్తుందనకున్న న్యూజిలాండ్‌కు నిరాశే మిగిలింది. తొలిసారి న్యూజిలాండ్ గడ్డపై ఆడుతున్న రాహుల్, పడిక్కల్ ఏకాగ్రతతో బ్యాటింగ్ చేయడంతో ఫస్ట్ సెషన్‌లో బ్లాక్‌క్యాప్స్ బౌలర్ల పప్పులుడకలేదు. ఓవర్‌నైట్ స్కోరు 159/1తో నాలుగో రోజు ఆట కొనసాగించిన రాహుల్, పడిక్కల్ జోడీ.. తొలి సెషన్‌లో 27 ఓవర్లు ఆడి వికెట్లేమీ నష్టపోకుండా 80 రన్స్ చేసి ప్రత్యర్థి బౌలర్ల ఆశలపై నీళ్లు చల్లింది. అనసరపు షాట్ల జోలికి పోకుండా ఆడిన ఈ కర్నాటక బ్యాటింగ్ ద్వయం.. స్ట్రైక్‌ను రొటేట్ చేసుకుంటూ స్కోరును 200 మార్కు దాటించారు.ఇదే క్రమంలో పడిక్కల్ అర్ధ శతకమూ పూర్తైంది. పేసర్లతో పని కాకపోవడంతో కివీస్ సారథి లాథమ్.. 57వ ఓవర్‌లో స్పిన్నర్ ఫిలిప్స్‌ను రంగంలోకి దించాడు. కానీ అప్పటికే క్రీజులో పాతుకుపోయిన రాహుల్ అతడి బౌలింగ్‌లో లాంగాన్ మీదుగా సూపర్ సిక్స్, ఫోర్‌తో 90ల్లోకి వచ్చాడు. లంచ్ తర్వాత డఫీ వేసిన ఓవర్లో సింగిల్‌తో తన కెరీర్‌లో 13వ సెంచరీని నమోదుచేశాడు. తద్వారా సేనా (సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలపై సెంచరీ చేసిన నాలుగో భారత బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు. పడిక్కల్ కూడా 80ల్లోకి చేరి వరుసగా మూడో టెస్టు సెంచరీ దిశగా సాగినట్టే అనిపించాడు. కానీ 81వ ఓవర్లో కొత్తబంతిని తీసుకున్న ఆతిత్య జట్టుకు 83వ ఓవర్లో జెమీసన్ బ్రేక్‌ఇచ్చాడు. అతడు పడిక్కల్‌ను బౌల్డ్ చేయడంతో 165 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.



కెప్టెన్ జోరు.. పంత్ దూకుడు

పడిక్కల్ నిష్క్రమించే సమయానికి మెరుగైన స్థితిలో ఉన్న టీమిండియాకు కెప్టెన్ గిల్ రాకతో స్కోరుబోర్డు జోరందుకుంది. రాహుల్‌తో కలిసి మూడో వికెట్‌కు అతడు 91 రన్స్ జతచేశాడు. సెంచరీ తర్వాత రాహుల్ గేర్ మార్చగా గిల్ కూడా ధాటిగా ఆడాడు. టీ విరామం తర్వాత డఫీ బౌలింగ్‌లో సిక్స్‌తో గిల్ హాఫ్ సెంచరీ పూర్తైంది. అతడి బౌలింగ్‌లోనే రాహుల్ కూడా పాయింట్ మీదుగా చూడముచ్చటైన సిక్స్ కొట్టాడు. కానీ స్మిత్ 104వ ఓవర్లో బంతిని తప్పుగా అంచనా వేసి క్లీన్‌బౌల్డ్ అవడంతో భారత్ మూడో వికెట్ కోల్పోయింది.అతడి స్థానంలో వచ్చిన పంత్.. ఆరంభంలో ఆచితూచి ఆడినా ఆ తర్వాత జూలు విదిల్చడంతో స్కోరుబోర్డు జోరందుకుంది. ఫిలిప్స్ ఓవర్లో బౌండరీతో గిల్ నైంటీస్‌లోకి వచ్చాడు. హెన్రీ ఓవర్లో రెండు బౌండరీలు బాదిన పంత్.. డఫీ బౌలింగ్‌లో 6, 6, 4 కొట్టడంతో గిల్ సేన ఆధిక్యం 100 పరుగులు దాటింది. అదే ఊపులో అతడు బౌండరీతో టెస్టుల్లో 22వ హాఫ్ సెంచరీని సాధించాడు. అయితే మ్యాచ్ ముగుస్తుందనగా డఫీ వేసిన ఆఖరి ఓవర్లో గిల్ క్లీన్‌బౌల్డ్ అవడంతో అతడి శతకం చేజారింది.

భారత్ రెండో విజయం



భోపాల్: మహిళల హాకీ ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టు వరుసగా రెండో విజయాన్ని నమోదుచేసింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్.. 2-1తో సౌత్‌కొరియాను ఓడించింది. భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (30వ నిమిషంలో), సునెలిత (34వ) తలా ఓ గోల్ చేశారు. కొరియా నుంచి హోంగ్ యుంగ్వెన్ (56) ఒక గోల్ కొట్టింది. మ్యాచ్‌లో రాణించిన నవ్‌నీత్ కౌర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

ఊహించని నిర్ణయం: ధోనీ రిటైర్మెంట్‌పై జహీర్ ఖాన్ ఆసక్తికర వ్యాఖ్యలు

- ఐపీఎల్‌లో ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన ఎంఎస్ ధోనీ
- రాబోయే 2027 సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ మెంటార్‌గా కొత్త ప్రయాణం
- ధోనీ వీడ్కోలు నిర్ణయం తనను ఆశ్చర్యపరిచిందన్న హెడ్ కోచ్ జహీర్ ఖాన్



టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రయాణానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుతో సుదీర్ఘ అనుబంధం ఉన్న ధోనీ, ప్లేయర్‌గా రిటైర్మెంట్ తీసుకుని 2027 సీజన్ నుంచి జట్టు మెంటార్‌గా బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ అనూహ్య నిర్ణయంపై సీఎస్‌కే హెడ్ కోచ్ జహీర్ ఖాన్ స్పందిస్తూ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.ధోనీ రిటైర్మెంట్ నిర్ణయం వ్యక్తిగతంగా తనను ఆశ్చర్యానికి గురిచేసిందని జహీర్ ఖాన్ పేర్కొన్నాడు. అయితే ఏ సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలో ధోనీకి బాగా తెలుసని చెప్పాడు. పిక్క కండరాల గాయం కారణంగా ధోనీ 2026 ఐపీఎల్ సీజన్‌కు పూర్తిగా దూరమయ్యాడు. అతడు చివరిసారిగా 2025 సీజన్‌లో మైదానంలో కనిపించాడు. నవంబర్ 17న ప్లేయర్ రిటెన్షన్ జాబితా విడుదలైన సమయంలో ధోనీని మెంటార్‌గా నియమిస్తున్నట్లు సీఎస్‌కే యాజమాన్యం ప్రకటించింది. 2008 నుంచి 19 సీజన్ల పాటు ఐపీఎల్‌లో కొనసాగిన ధోనీ, మొత్తం 278 మ్యాచ్‌లలో 5,439 పరుగులు సాధించాడు. కెప్టెన్‌గా సీఎస్‌కే జట్టుకు 5 ఐపీఎల్ టైటిళ్లు, 2 ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలను అందించాడు. ఆటగాడిగా బరిలోకి దిగకపోయినా, రాబోయే సీజన్లలో మెంటార్‌గా అతడు ఇచ్చే సూచనలు జట్టుకు కొండంత బలాన్నిస్తాయని యాజమాన్యం భావిస్తోంది.

"సెలక్టర్లు అద్భుతంగా పనిచేస్తున్నారు".. సిరాజ్ వివాదంపై కపిల్ దేవ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- సెలక్టర్లు అద్భుతమైన పనితీరు కనబరుస్తున్నారన్న కపిల్ దేవ్
- ఎంపిక వ్యవహారాలపై మాట్లాడే అధికారం తనకు లేదని వ్యాఖ్య
- ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరచడం అసాధ్యమన్న మాజీ కెప్టెన్
- కెప్టెన్, సెలక్టర్ల ప్రణాళికలకే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టీకరణ
- భారత క్రికెట్ మంచి విజయాలు సాధించడమే ముఖ్యమన్న దిగ్గజం



న్యూజిలాండ్‌తో జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో పేసర్ మహ్మద్ సిరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించడంపై రాజకీయ దుమారం నడుస్తోంది. గతంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచినప్పటికీ సిరాజ్ పేరు కారణంగానే అతనికి చోటు దక్కలేదని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ ఆరోపించారు. మతం ఆధారంగానే ఈ వివక్ష జరిగిందంటూ ఆయన విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. దేశంలో ఎవరిపైనా వివక్ష ఉండదని, మతం లేదా కులం ఆధారంగా కాకుండా కేవలం ప్రతిభ ప్రాతిపదికనే అవకాశాలు దక్కుతాయని స్పష్టం చేశారు. ఈ వివాదంపై తాజాగా భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు. సిరాజ్ ఎంపిక అంశంపై మాట్లాడే అధికారం తనకు లేదని తెలిపాడు. ప్రస్తుత సెలక్టర్లు అద్భుతంగా పనిచేస్తున్నారని ప్రశంసించాడు. తమలాంటి వ్యక్తులు ఇలాంటి నిర్ణయాలపై వ్యాఖ్యానించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. ఆ బాధ్యత నిర్వర్తిస్తున్న వారే జవాబుదారీగా ఉండాలని చెప్పాడు. సెలక్షన్ వ్యవస్థలో ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరచడం ఎవరికీ సాధ్యం కాదని అభిప్రాయపడ్డాడు.

వ్యవస్థపై విమర్శలు చేయడం సమంజసం కాదని కపిల్ దేవ్ పేర్కొన్నాడు. ప్రస్తుతం భారత క్రికెట్ అద్భుతంగా రాణిస్తోందన్నాడు. అదే అత్యంత కీలకమైన విషయమని చెప్పాడు. సిరాజ్ ఆటతీరు తనకు కూడా ఇష్టమేనని వెల్లడించాడు. అయితే జట్టు ఎంపిక విషయంలో వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు తావుండకూడదని స్పష్టం చేశాడు. సెలక్టర్లు, జట్టు మేనేజర్, కెప్టెన్ మాత్రమే సమష్టిగా తుది జట్టును ఎంపిక చేయాల్సి ఉంటుందని వివరించాడు. భవిష్యత్తు కోసం ఆయా విభాగాల ప్రణాళికలు ఎలా ఉన్నాయనేదే ప్రధానమని కపిల్ దేవ్ గుర్తుచేశాడు.

శాండ్‌పేపర్ వివాదం.. ఆ చీకటి రోజుల్లోకి మళ్లీ వెళ్లలేను: డారెన్ లీమన్

శాండ్‌పేపర్ వివాదం గురించి తనకు ముందే తెలియదన్న ఆసీస్ మాజీ కోచ్

ఆటగాడు కామెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ చేసిన ఆరోపణలను ఖండించిన లీమన్

ఆ ఘటన తర్వాత తాను మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని ఆవేదన

కోచ్‌గా తాను బాధ్యత వహించినా, కుట్రలో భాగస్వామిని కాదని వెల్లడి



ఆస్ట్రేలియా క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా అప్రతిష్ఠపాలు చేసిన 2018 నాటి శాండ్‌పేపర్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కుట్ర గురించి తనకు ముందే తెలుసంటూ వస్తున్న ఆరోపణలను ఆస్ట్రేలియా మాజీ కోచ్ డారెన్ లీమన్ మరోసారి తీవ్రంగా ఖండించాడు. ఆ ఘటన తర్వాత తాను మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని, మళ్లీ ఆ చీకటి రోజుల్లోకి వెళ్లాలనుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.2018లో దక్షిణాఫ్రికా పర్యటనలో ఆస్ట్రేలియా జట్టు బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిన సంగతి తెలిసిందే. ఇటీవల ఆటగాళ్లు ఉస్మాన్ ఖవాజా, కామెరాన్ బ్యాన్‌క్రాఫ్ట్ చేసిన వ్యాఖ్యలతో ఈ వివాదం మళ్లీ వార్తల్లోకెక్కింది. బ్యాన్‌క్రాఫ్ట్ తన కథనంలో, బంతిని ఎలా రఫ్ చేయాలనే చర్చ డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిందని, ఆ సమయంలో కోచ్ డారెన్ లీమన్, బౌలింగ్ కోచ్ డేవిడ్ సేకర్ కూడా అక్కడే ఉన్నారని పేర్కొన్నాడు. డేవిడ్ వార్నర్ శాండ్‌పేపర్ వాడాలనే ఆలోచనను ముందుకు తెచ్చాడని కూడా రాశాడు.

ఈ ఆరోపణలపై ఏబీసీ రేడియోతో మాట్లాడిన లీమన్ స్పందించాడు. "2018 నాటి ఘటనపై నా అభిప్రాయం ఇప్పటికీ మారలేదు. అది ఒక చీకటి సమయం, మేము చాలా తప్పులు చేశాం. కానీ, నా వాదన మాత్రం అదే. ఆ కుట్ర గురించి నాకు ముందుగా తెలియదు" అని స్పష్టం చేశాడు.బ్యాన్‌క్రాఫ్ట్ చెప్పినట్టుగా ఆ చర్చ జరిగినప్పుడు తాను అక్కడ ఉన్నట్లు తనకు గుర్తులేదని లీమన్ తెలిపాడు. "ఆ సంభాషణ జరిగినప్పుడు నేను అక్కడ ఉన్నట్లు నాకు గుర్తులేదు. అయినా అది జరిగి ఎనిమిదిన్నర సంవత్సరాలు అవుతోంది. నా వెర్షన్ ఇదే, దానికే కట్టుబడి ఉంటాను" అని అన్నాడు.ఆ ఘటన తర్వాత కోచ్ పదవికి రాజీనామా చేసిన లీమన్, ఆ వైఫల్యానికి బాధ్యత వహించాడు. "రివర్స్ స్వింగ్ కోసం బంతిని నేలకేసి కొట్టడం, ఒకవైపు రఫ్ చేయడం వందేళ్లుగా జరుగుతోంది. కానీ 2018లో అది హద్దులు దాటింది. కోచ్‌గా దానికి నేనే బాధ్యుడిని. ఆ ఘటన వల్ల నేను ఏమీ నష్టపోలేదని కొందరు అంటున్నారు. కానీ, నేను క్రికెట్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యోగాన్ని కోల్పోయాను. అందుకు నేను చింతిస్తున్నాను. ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను" అని లీమన్ ఆవేదనగా మాట్లాడాడు.

"ఆ వివాదం తర్వాత నేను మానసికంగా తీవ్రంగా కుంగిపోయాను. ఊహించనంతటి చీకటి రోజులు చూశాను.

సచిన్ టెండూల్కర్ కూతురు సారా పెళ్లిపై మళ్లీ పుకార్లు.. ఈసారి వార్తల్లోకి యువ హీరో

- సారా టెండూల్కర్, నటుడు రాజ్‌వీర్ డియోల్ పెళ్లిపై సోషల్ మీడియాలో ప్రచారం
- 2027లో వీరి వివాహం జరగవచ్చంటూ ఎక్స్, రెడ్డిట్ వేదికల్లో వైరల్ అవుతున్న పోస్టులు
- ఈ ప్రచారంపై ఎలాంటి ప్రకటన చేయని టెండూల్కర్, డియోల్ కుటుంబాలు



క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ వివాహం గురించి సోషల్ మీడియాలో సరికొత్త ప్రచారం వైరల్ అవుతోంది. బాలీవుడ్ ప్రముఖ నటుడు సన్నీ డియోల్ కుమారుడు, యువ నటుడు రాజ్‌వీర్ డియోల్‌తో సారా వివాహం జరగనుందంటూ నెట్టింట వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (ట్విట్టర్), 'రెడ్డిట్'లలో వైరల్ అయిన కొన్ని పోస్టుల ఆధారంగా ఈ ఊహాగానాలు పుట్టుకొచ్చాయి. వీరిద్దరికీ త్వరలోనే సంబంధం కుదరనుందని, 2027లో పెళ్లి జరిగే అవకాశం ఉందని ఆ పోస్టుల్లో పేర్కొన్నారు. ఈ వార్తలు కాస్తా ఇంటర్నెట్‌లో విపరీతంగా వ్యాపించడంతో పలు ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్లలో కథనాలు వెలువడ్డాయి.అయితే, ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని స్పష్టమవుతోంది. సారా టెండూల్కర్, రాజ్‌వీర్ డియోల్ వివాహం గురించి వస్తున్న వార్తలపై అటు టెండూల్కర్ కుటుంబం కానీ, ఇటు డియోల్ కుటుంబం కానీ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇరు కుటుంబాల నుంచి ఎలాంటి ధ్రువీకరణ లేకపోవడంతో ఇవన్నీ పూర్తిగా నిరాధారమైన పుకార్లుగానే తెలుస్తోంది.గతంలోనూ సారా టెండూల్కర్ వ్యక్తిగత జీవితంపై పలుమార్లు ఇలాంటి వదంతులు వచ్చాయి. టీమిండియా యువ క్రికెటర్ శుభ్‌మన్ గిల్‌తో ఆమె పేరును ముడిపెడుతూ వార్తలు వచ్చినా, వాటిపై కూడా ఎప్పుడూ అధికారిక స్పష్టత రాలేదు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609